

సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డితో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్



గీసుగొండ మండలం కొనాయిమాకుల వద్ద చదును చేసిన ఎస్సారెస్పీ భూమి

ఎస్సారెస్పీ భూములపై కన్ను

కాకతీయుల కోటకట్ట భూములకు రక్షణ కరువు

- కాలువకు ఇరుపక్కలా మాయమవుతున్న మట్టి
- చదును చేసి కబ్జాకు కొందరి యత్నం
- ఇప్పటికే కొన్నిచోట్ల ప్రైవేటు వ్యక్తులకు పట్టాలు
- ఎస్సారెస్పీ భూముల్లో వెలిసిన గుడిసెలు
- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

గీసుగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల నాటి మట్టికోట, ఎస్సారెస్పీ భూములపై కొంతమంది కబ్జాకోరులు కన్నేశారు. ఇప్పటికే గుట్టుచప్పుడు కాకుండా కోటకట్ట, ఎస్సారెస్పీ భూములను కొందరు పట్టాలు చేసుకున్నట్లు సమాచారం. ప్రధానంగా వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని బాలయ్యపల్లి నుంచి శాయంపేట వరకు ఎస్సారెస్పీ ప్రధాన కాలువకు ఇరుపక్కలా వందల ఎకరాల భూమి చదునై ఉంది. కాలువ పక్కన వ్యవసాయ భూములు ఉన్న వారు ఎస్సారెస్పీ భూములు ఆక్రమించుకొని సాగుచేస్తున్నారు. అంతేకాకుండా డీబీఎం 38, డీబీఎం 40 కాలువలకు ఇరువైపులా, అండర్ టన్నెల్ (యూటీ) ఉన్న చోట కూడా ఎస్సారెస్పీ భూములు కబ్జాలకు గురయ్యాయని స్థానికులు అంటున్నారు. దీనిపై కొద్ది రోజుల కిందట ఎస్సారెస్పీ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు కూడా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మామూళ్లకు ఆశపడి ఎస్సారెస్పీ అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కు అవుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. బాలయ్యపల్లి సమీపంలో యూటీ కాలువను సగం వరకు ఆక్రమించటంతో వర్షాకాలంలో యూటీ కాలువలో నీరుపట్టక పంట పొలాలను ముంచెత్తుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే కొనాయిమాకుల వద్ద ఉండే ప్రధాన కాలువ ఇరుపక్కలా ఉన్న భూములకు బాగా డిమాండ్ ఉండడంతో కొంతమంది ఆ భూములను కాజేసి అక్రమ పట్టాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే వంచనగిరి నుంచి పోతరాజుపల్లి వరకు కోట మట్టిని తరలించుకుపోయారు. తేలిన భూమిని ఇప్పటికే పట్టాలు చేయించుకొని సాగుచేస్తున్నారు. కొన్నేళ్ల కిందట ఓ ప్రైవేటు వ్యక్తి ఎస్సారెస్పీ భూమిని ఏకంగా ప్లాట్‌లు చేసి అమ్మేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిలిచిపోయింది.

కొనాయిమాకుల వద్ద..

ఎస్సారెస్పీ ప్రధాన కాలువ తవ్వే క్రమంలో కొనాయిమాకుల ప్రాంతం ఎత్తుగా ఉండటంతో నీటి ప్రవాహం అనుకూలంగా ఉండేందుకు కాలువను ఎక్కువ లోతుగా తవ్వినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో తవ్విన మట్టిని బయటకు ప్పలుగా పోసేందుకు గాను ప్రధాన కాలువకు ఇరువైపులా 100 నుంచి 150 మీటర్ల మేర భూమిని కొనుగోలు చేశారు. అయితే ఇటీవల ఆ మొరాన్ని అ క్రమంగా తరలించటంతో ఇపుడు భూమి చదునుగా మారింది. గీసుగొండ కెనాల్ గేట్ల నుంచి డీబీఎం 40 వరకు గల దాదాపు 100 ఎకరాల ఎస్సారెస్పీ భూములకు కోట్లల్లో ధర పలుకుతుండడంతో భూ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల వందలాది మంది ఎస్సారెస్పీ భూముల్లో గుడిసెలు వేసుకున్నారు. కాగా, ఎస్సారెస్పీ కొంత భూమిలో సోలార్ పవర్ ప్లాంట్, డెయిరీ ఫామ్ నిర్మాణాలు చేపట్టి వాటి నిర్వహణ బాధ్యతను మహిళా సంఘాలకు అప్పచెప్పేందుకు ఇటీవల రెవెన్యూ అధికారులు సర్వేచేశారు.

పట్టించుకోని అధికారులు

ఎస్సారెస్పీ భూములతో పాటు కాకతీయుల కోటకట్ట భూములు కబ్జాలు, అన్యాక్రాంతం అవుతున్నా అటు పురావస్తు శాఖ అధికారులు గానీ, ఇటు ఎస్సారెస్పీ అధికారులు గానీ పట్టించుకోవటం లేదనే విమర్శలున్నాయి. ఆక్రమణకు గురైన భూములను పట్టాలు చేసుకుంటున్నట్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎస్సారెస్పీ భూములకు ఎందుకు హద్దులు నిర్ణయించడంలేదని వారు ప్రశ్నిస్తున్నారు.

హద్దులు నిర్ణయించకపోవడంతో కొన్నిచోట్ల కెనాల్ సమీపంగా ఉన్న భూ యజమానులకు భూ పట్టాలు కావడంలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎస్సారెస్పీ భూములకు హద్దులు నిర్ణయించి ఆక్రమణలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు కోరుతున్నారు.

మట్టి మాయం

ఒకప్పుడు ఎస్సారెస్పీ కాలువకు ఇరు పక్కలా ఎత్తైన కొండల లాంటి మట్టికుప్పలు కనబడేది. కానీ, అవి ఇప్పుడు కానరాకుండా పోయాయి. మట్టి దందా వ్యాపారులతో కొండల లాంటి మట్టి అక్రమంగా తరలించబడి ఆనవాళ్లు లేకుండా పోయాయి. అక్రమ మట్టి వ్యాపారంతో కొందరు లక్షలు గడించారు. కెనాల్ మొరం తరలించుకుపోవటంతో వందల ఎకరాలను కబ్జా చేసేందుకు చాపకింద నీరులా ప్రయత్నిస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిది నిర్బంధ పాలన

- విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేశారు
- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి నిర్బంధ, నిరంకుశ పాలన సాగిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా దాస్యం వినయ్ భాస్కర్ ధ్వజమెత్తారు. గురువారం హనుమకొండలోని సుబేదారి పోలీసుస్టేషన్‌లో అరెస్టు అయిన కేయూ విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. అక్కడే ఉన్న సీఐతో మాట్లాడి రెండు రోజులుగా విద్యార్థులను విడుదల చేయకుండా పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేదాక విద్యార్థులకు అండగా బీఆర్ఎస్ పార్టీ తరపున పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు బైరపాక ప్రశాంత్, గొల్లపల్లి వీరస్వామి, వస్తం అనిల్, రాసూరి రాజేష్, బి.నర్సింహరావు, బొషబోయిన సంతోష్, మొగిలి వెంకట్‌రెడ్డి, హకీం నవీన్, మాలోతు రాజేష్, మర్రి మహేష్, మంద నరేష్, ఎల్తూరి సాయికుమార్, కుమ్మరి శ్రీనాథ్, శివ, రంజిత్, వంశీ, వినయ్ తదితరులు పోలీసుల అదుపులో ఉన్నారు.

సహకార సంఘాలు ఆర్థిక వృద్ధిని సాధించాలి

- వ్యాపార మార్గాలను విస్తరించుకోవాలి
- శిక్షణ తరగతుల్లో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు ఆర్థికంగా వృద్ధి సాధించాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సూచించారు. సహకార శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడారు. సంఘాలు ఆర్థికంగా వృద్ధి సాధించేందుకు అవసరమైన మార్గాలను అన్వేషించాలన్నారు. కొత్త ఆలోచనలతో కూడిన వాటితో పాటు ప్రస్తుత వ్యాపారాలను విస్తరించుకోవాలన్నారు. ప్రణాళిక మేరకు కృషి చేస్తే తప్పక ఆర్థిక ప్రగతి సాధన ఉంటుందన్నారు. సహకార సంఘాలు రైతు ఉత్పత్తిదారుల సంస్థలాగా పనిచేస్తే మంచి లాభాలను ఆశించవచ్చని సూచించారు. సాధారణ సేవా కేంద్రాల ద్వారా సేవలు అందిస్తూ రైతుల అభిమానాన్ని చూరగొనాలని పేర్కొన్నారు. రైతులకు దీర్ఘకాలిక రుణాలు అందచేయాల్సి ఉందన్నారు. డీసీసీ బ్యాంక్ టర్నోవర్ రూ.870కోట్ల నుంచి రూ.2,229 కోట్లకు చేరడం గర్వంగా ఉందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 19 శాఖలుగా డీసీసీ బ్యాంకును 32 శాఖలకు విస్తరించినట్లు తెలిపారు. నందనంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ మార్కెట్ వ్యాపార వృద్ధిని సాధిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్ ఎం.డి. కేవీఎస్ అన్నపూర్ణ, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, ఉమ్మడి జిల్లాలోని డీసీవోలు సంజీవరెడ్డి, నీరజ, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వాల్యానాయక్, వెంకటేశ్వర్లు, సర్దార్‌సింగ్‌తోపాటు డీసీసీబీ సీఈవో వజీర్ సుల్తాన్, డైరెక్టర్లు జగన్‌మోహన్‌రావు, హరిప్రసాద్, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రస్టేషన్‌లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు

- హెచ్‌సీయూ పక్కనున్న భూములపై అనవసర రాజకీయం
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే కుట్ర
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ధర్మసాగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నాయని, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు అందించే బియ్యం ధర రూ.40 అయితే కేంద్రం.. రూ.30 చెల్లిస్తోందని, రాష్ట్రప్రభుత్వం కేవలం రూ.10 మాత్రమే భరిస్తోందని సంజయ్ కనీస అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. బీజేపీకి నిజంగా పేదలపై ప్రేమ ఉంటే దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. కల్వకుంట కుటుంబం తెలంగాణపై పడి దోచుకోవడం వల్ల వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి పదేళ్ల నీటి పారుదల శాఖ నిధులను మళ్లించారని ఆరోపించారు. కేసీఆర్ తన సొంత జిల్లా మెదక్‌లో కొండ పోచమ్మ, రంగనాయక్ సాగర్, మల్లన్న సాగర్ మూడు రిజర్వాయర్లతో పాటు తన ఫామ్ చుట్టూ సీసీ లైనింగ్‌తో పాటు కాలువల నిర్మాణం చేపట్టారని విమర్శించారు. కాళేశ్వరానికి ఖర్చు చేసిన లక్ష కోట్లలో కనీసం ఐదు వేల కోట్లు దేవాదుల ప్రాజెక్టుకు ఖర్చు చేస్తే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు సాగు నీరు వచ్చేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్ట్ పనులను త్వరితగతిగా పూర్తి చేసేందుకు కృషి చేస్తోందన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయించి ప్రతీ ఎకరానికి సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రసాద్, మాజీ సర్పంచ్‌లు శరత్, కునూరు రాజు, మండల నాయకులు పాల్గొన్నారు.

వాహన మరమ్మతుల జాప్యంపై మేయర్ సీరియస్

బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డు ఆకస్మిక తనిఖీ



వెహికిల్ షెడ్డులో అధికారులకు సూచనలిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చెత్త తరలింపు వాహనాల మరమ్మతులో సిబ్బంది చేస్తున్న జాప్యంపై మేయర్ గుండు సుధారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డును మేయర్ సంబంధిత అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడి రిజిస్టర్ పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. రెండు మాసాలుగా శానిటేషన్ విభాగం చెత్త తరలింపు స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లు మరమ్మతులు చేయకుండా షెడ్డుకే పరిమితమైనట్టు తన దృష్టికి వచ్చిందని అన్నారు. ఇప్పటికైనా వాహనాలు మరమ్మతు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ మహేందర్, డీఈ శివానందం, ఏఈలు పణికుమార్, సంతోష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

చపాట మిర్చికి జియో ట్యాగింగ్ శుభపరిణామం

- అంతర్జాతీయ ఎగుమతులకు అవకాశం
- వరంగల్ కలెక్టర్ సత్యశారద
- అధికారులతో కలిసి ఏనుమాముల మార్కెట్ సందర్శన



చపాట మిర్చిని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 3: (ఆంధ్రజ్యోతి): మన దగ్గర సాగయ్యే చపాట మిర్చి జియో ట్యాగింగ్ గుర్తింపు లభించడం శుభపరిణామమని, మిర్చిని అంతర్జాతీయ ఎగుమతులు చేసుకునేందుకు మంచి అవకాశం లభిస్తోందని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను గురువారం కలెక్టర్ సత్యశారద సందర్శించారు. మిర్చి యార్డును సందర్శించి చపాట మిర్చి రైతులతో మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు? చపాటమిర్చి ఎంత సాగు చేశారు? ఎంత దిగుబడి వచ్చింది? మార్కెట్లో ఎంత రేటు పలికింది? లాంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు సాగు, దిగుబడి వివరాలు చెప్పారు. మార్కెట్లో మిర్చికి ధరలు చాలా తక్కువగా ఉన్నాయని, మూడేళ్ల కిందట చపాట మిర్చి క్వింటా రూ.లక్ష వరకు పలుకగా ప్రస్తుతం ఇరువై నుంచి ముప్పై వేల మధ్యలోనే ధరలు ఉంటున్నాయని కలెక్టర్‌కు తమ ఆవేదనను చెప్పుకున్నారు. ముప్పై ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా మూడేళ్ల కిందట చపాట మిర్చికి మంచి డిమాండ్ పలుకడంతో రూ.లక్ష వరకు పలికిన వాస్తవమేనని కానీ.. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో చపాట మిర్చి ఎగుమతులు తగ్గడంతో ధరలు పడిపోయాయని వ్యాపారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యాపారులు, రైతు సంఘాల కోరిక మేరకు మార్కెట్లో రైతులకు మజ్జిగ పంపిణీ చేపడతామన్నారు. సరుకులను తూకం వేసే పీవోఎస్ మిషన్లు మరిన్ని కావాలని రైతులు అడుగుతున్నారని, వాటిని కూడా తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

ఈ సందర్భంగా టాయిలెట్స్ అందుబాటులో లేవని, దూరంగా ఉండడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. అలాగే కార్యనిర్వహణ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఒక భవనం కావాలని కలెక్టర్‌ను వ్యాపారులు అభ్యర్థించారు. దీంతో రైతులకు టాయిలెట్స్ అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని మార్కెట్ కార్యదర్శిని ఆదేశించారు. వ్యాపారులకు తాత్కాలికంగా చైనా టెంట్ వేసి కార్యకలాపాలు నిర్వహించుకునే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కాగా, అంతకుముందు ఈవీఎంలను భద్రపరిచిన గోదాములను కలెక్టర్ సందర్శించారు. ఆ తదుపరి మార్కెట్‌లో త్వరలో ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాట్లను పరిశీలించారు. రైతు విశ్రాంతి భవన్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఎంవో సురేఖ, మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్యా, తహసీల్దార్ ఎక్బాల్, గ్రేడ్-2 కార్యదర్శి అంజిత్‌రావు, ఏఎస్ రాజేందర్, రాజేష్ డి.కరాణీ, చింతపల్లి వీరారావు, సాగర్ల శ్రీనివాస్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య తదితరులు

ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ టోర్నమెంట్ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 4 నుంచి 7 వరకు జమ్ముకాశ్మీర్‌లోని యూనివర్సిటీ ఆఫ్ కాశ్మీర్‌లో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ పవర్ లిఫ్టింగ్ మహిళ, పురుషుల జట్టును 2024-25 ఏడాదికి గురువారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో మహిళ విభాగం నుంచి సీహెచ్. రమ (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూ), బి. చిన్మయి (యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల, వరంగల్), బి.శృతి (వాగ్దేవి వ్యాయామ విద్యా కళాశాల, బొల్లికుంట)లున్నట్లు తెలిపారు. అలాగే పురుషుల విభాగం నుంచి పి.విశాల్ (కిట్స్ కళాశాల, వరంగల్) ఎస్.పోతరాజు (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, వరంగల్), ఎం.అమాన్ (కిట్స్‌కళాశాల, వరంగల్), వి.వెంకటేశ్ (కేడీసీ హనుమకొండ) లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ గర్ల్స్ కళాశాల, ఖమ్మం ఫిజికల్ డైరెక్టర్ డి.శ్వేత వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

24 నుంచి పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంటీఎం, ఎంహెచ్‌ఆర్ఎం పీజీ కోర్సుల రెండో ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 26 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు గురువారం ఒకప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 26, 28, 30, మే2, 5, 7తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.ఇతర వివరాలకు వర్సిటీవెబ్‌సైట్‌లోచూడాలని పేర్కొన్నారు.

జాతీయ ఖోఖో క్రీడలకు తండ్రీకొడుకు



పూరీలోని జరుగుతున్న ఖోఖో క్రీడల్లో పాల్గొంటున్న రాంబాబు, అతడి కుమారుడు సృజన్

గీసుగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం పూరిలోని జగన్నాథ స్టేడియంలో జరుగుతున్న 57వ జాతీయ ఖోఖో క్రీడల్లో గీసుగొండ గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు కోట రాంబాబు, అతడి కుమారుడు సృజన్ పాల్గొంటున్నారు. నర్సంపేట ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాంబాబు జాతీయ పోటీలకు న్యాయనిర్ణేతగా ఎంపిక కాగా, ఇంటర్మీయట్ చదువుతున్న అతడి కుమారుడు సృజన్ తెలంగాణ రాష్ట్ర ఖోఖో జట్టుకు ఎంపికయ్యారు. దీంతో తండ్రీకొడుకులు జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ ఏప్రిల్ 4 వరకు క్రీడలు జరుగుతాయి.

దర్బంగా ఎక్స్‌ప్రెస్ రద్దు

కాజీపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రైల్వే ఇంటర్‌లాకింగ్, ఇతరత్రా మరమ్మతుల దృష్ట్యా కాజీపేట జంక్షన్ మీదుగా నడిచే దర్భంగ ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (17007) సికింద్రాబాద్ నుంచి దర్భాంగ వెళ్లె ఈ రైలును ఈ నెల 8, 12, 15, 19, 22 తేదీలలో తిరిగి (17008) దర్భాంగ నుంచి సికింద్రాబాద్ వైపు ఈ నెల 11, 15, 18, 22, 25 తేదీలలో రద్దు చేస్తున్నామని, ఈ రైల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు గమనించాలని చెప్పారు.

భూపాలపల్లికి బైపాస్ రోడ్డు మంజూరు చేయాలి

- ఎఫ్‌వోబీ, ఆర్‌వోబీలను నిర్మించాలి
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ కావ్య వినతి



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ కడియం కావ్య

హనుమకొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు మంజూరు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర రవాణ, రహ దారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. గురువారం కావ్య ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. గనులు, అడవులతో సహజ వనరులు సమృద్ధిగా ఉన్న భూపాలపల్లి జిల్లాలో నిత్యం పెద్దఎత్తున పారిశ్రామిక కార్యకలాపాలు జరుగుతున్నం దువల్ల ట్రాఫిక్ పెరిగిపోయి పెద్ద ఎత్తున ప్రమాదాలు జరు గుతున్నాయని కేంద్ర మంత్రికి తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి భూపాలపల్లి పట్టణం చుట్టూ బైపాస్ రహదారిని 2024-25 వార్షిక ప్రణాళి కలో చేర్చాలని, దాని నిర్మాణానికి అవసరమైన నిధుల ను కేటాయించాలని కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. ఎంపీ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. వెంటనే డీపీఆర్ తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలి..

జాతీయ రహదారి-163 జనగామ జిల్లా, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని నిడిగొండ, రఘునాథపల్లి, ఛాగల్, చినపెండ్యాల, కరుణాపురం గ్రామాల్లో పుట్ ఓవర్ బ్రిడ్జిలు లేకపోవడంతో గ్రామస్థులకు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిని నివారించేందుకు అయా గ్రామాల పరిధిలో పుట్ ఓవర్ బ్రిడ్జిలను మంజురుచేయాలని కూడా కోరారు. కొన్ని గ్రామాల్లో సర్వీస్ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇందుకు సంబంధించి భూసేకరణ కూడా పూర్తయిందని వెల్లడించారు. వెంటనే సర్వీస్ రోడ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా జనగామ ఆర్‌వోబీ నుంచి కరుణాపురం వరకు అన్ని గ్రామాల్లో డ్రైనేజీలు నిర్మించారని, కానీ ఆ డ్రైనేజీల్లోని నీరు బయటకు వెళ్లకుండా గ్రామాల్లోకి వస్తున్నదని, కనుక మురుగు నీరు బయటకు వెళ్లేలా నిర్మాణాలు చేపట్టాలని అభ్యర్థించారు. వరంగల్ - జనగామ ఎంట్రీ పాయింట్ వద్ద నాలుగురోడ్లను కలిపే జంక్షన్ ఉందని, అక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కనుక భద్రతా చర్యల దృష్ట్యా జంక్షన్ పాయింట్‌ను అభివృద్ధి చేయాలని డాక్టర్ కావ్య కోరారు. ఎన్‌హెచ్-163 దాటే జనగామ - సూర్యాపేట నేషనల్ హైవే ఆర్‌వోబీ వద్ద ఉన్న అప్రోచ్ రోడ్లు చాలావరకు ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు అనుకూలంగా లేకపోవడం వల్ల ఆయా పాయింట్ల వద్ద తరుచూ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. అప్రోచ్ రోడ్ల విస్తరణ పనులు చేపట్టేందుకు నిధులను మంజూరు చేయాలని కోరారు.

కాజీపేట లోకోరన్నింగ్ డిపోపై పక్షపాత ధోరణి

కాజీపేట : దక్షిణ మధ్య రైల్వేలో అతిపెద్ద డిపోగా ఉన్న కాజీపేట లోకో రన్నింగ్ డిపోపై కొందరు రైల్వే అధికారులు పక్షపాతధోరణి తో వ్యవహరిస్తూ సిబ్బందిని అక్రమంగా ఇతర డివిజన్‌లకు తరలిస్తున్నారని, ఈ చర్యలను నిలిపివేయాలని గురువారం వరంగల్ ఎంపీ కడియం కావ్య పార్లమెంట్‌లో గళమెత్తారు. 15 ఏళ్లుగా 500 మందికి పైగా ఉద్యోగులను వివిధ కారణాలతో విజయవాడకు తరలించారని అన్నారు. కాజీపేట డిపోలో 709 మంది ఉద్యోగుల కావాల్సి ఉండగా 526 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు.

ప్రస్తుతం మంజూరైన 184 కొత్త లోకోపైలెట్ ఉద్యోగాలను ఇతర ప్రాంతాలకు తరలించారని, దీంతో ఇక్కడ పనిచేసే సిబ్బందిపై పనిఒత్తిడి పెరుగుతోం దని చెప్పారు. ఇక్కడి సిబ్బందిని విజయవాడకు తరలించే ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. కాజీపేట, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లపై పక్షపాతధోరణి ప్రదర్శిస్తున్నారని రైల్వే మంత్రి స్పందించి కాజీపేట రన్నింగ్ డిపోను కాపాడే చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన చాపర్తి సాంబయ్యపై నేరం రుజువైనందున యావజ్జీవ కారాగారా శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ వరంగల్ మొదటి అదనపు సేషన్స్ జడ్జి జి.ప్రేమలతారెడ్డి గురు వారం తీర్పు చెప్పారు. అదే విధంగా బాధితురాలికి రూ.8లక్షలు నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య.. అదే గ్రామానికి చెందిన 6వ తరగతి చదువుతున్న బాలికను బెదిరించి రెండు సార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. మైనర్ బాలిక అస్వస్థతకు గురి కావడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆమె గర్భవతి అని నిర్ధారించారు. దీంతో బాలికను విచారించగా చాపర్తి సాంబయ్య (73)అనే వ్యక్తి జామకాయలు ఇస్తానని తన ఇంట్లోకి తీసుకెళ్లి బెదిరించి అత్యాచారం చేశాడని, ఈ విషయం మీ ఇంట్లో చెబితే చంపుతానని బెదిరించాడని బాలిక తెలిపింది. దీంతో నిందితుడిపై బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి జీవిత ఖైదు, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ బొల్లం యుగందర్ సాక్షులను ప్రవేశపెట్టగా ఇన్‌స్పెక్టర్ బాబులాల్, ఏసీపీ బి.తిరుపతి కేసు దర్యాప్తు చేశారు. లైజన్ అధికారిగా ఏఎస్సై హరికృష్ణ, భరోసా లీగల్ సలహదారు సీహెచ్. నీరజ కేసులో సహకరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాస్తం రవికిరణ్ కేసు వాదించారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కడియంకు కర్రు కాల్చివాత పెట్టాలి

- రూ.800కోట్లతో అభివృద్ధి పచ్చి అబద్ధం
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

రఘునాథపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి, తన ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లో చేరి బీఆర్ఎస్‌ను నియోజకవర్గ ప్రజలను మోసం చేశారని, కడియంకు కర్రు కాల్చి వాత పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు. నిడిగొండ శివారులో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశానికి మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అధ్యక్షత వహించగా, పల్లా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే శ్రీహరి రూ.800 కోట్లు మంజూరు చేయించానని చెప్పు కోవడం పచ్చి అబద్ధమన్నారు. ఎనిమిది రూపాయల నిధులు కూడా తీసుకురాని దద్దమ్మ కడియం అని ఆరోపించారు. 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి 30 వేల మందికి తగ్గకుండా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చెవెల్లి సంపత్, వై.కుమార్ గౌడ్, మనోజ్ రెడ్డి, బాల్దె సిద్దులు, ఆకుల కుమార్, మారపాక రవి, గాడిపెల్లి ప్రేమలతా రెడ్డి, ఎడవెల్లి కృష్ణా రెడ్డి, ముసిపట్ల విజయ్, గూడ కిరణ్ కుమార్, తిప్పారపు బాబురావు, పరుశరాములు, బొంగు అయిలయ్య, గైని శ్రీనివాస్, తిప్పారపు మమత, రమ్యశ్రీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

మృతురాలిది వర్ధన్నపేట మండలం దివిటిపల్లి



ఉప్పలమ్మ(ఫైల్)

జఫర్‌గడ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జఫర్‌గడ్ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వర్ధన్నపేట మండలం దివిటిపల్లికి చెందిన జోగు ఉప్పలమ్మ(70)మృతి చెందింది. ఎస్ఐ రాంచరణ్ నాయక్ కథనం దివిటిపల్లికి చెందిన జోగు ఉప్పలమ్మ, ఎల్లమ్మతోపాటు ఇదే గ్రామానికి చెందిన కంజర్ల దయాకర్ బైక్‌పై కూర్చుని ముగ్గురు కలిసి జఫర్‌గడ్ మండలంలోని ఉప్పుగల్లులో బంధువుల దశదిన కర్మకు హాజరయ్యేందుకు వెళ్తున్నారు. ఈక్రమంలో జఫర్‌గడ్ శివారు నల్లబండ సమీపంలో లో లెవల్ డ్యాంవద్ద బైక్ అదుపు తప్పి కిందపడిపోయింది. బైక్‌పై వెనకాల కూర్చున్న జోగు ఉప్పలమ్మ, ఎల్లమ్మ ఎగిరి రోడ్డుపై పడగా, ఉప్పలమ్మకు తల,ఇతర శరీరభాగాల్లో బలంగా దెబ్బలు తగలడంతో అక్కడికక్కడే చనిపోయింది. ఎల్లమ్మకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. అతివేగమే ప్రమాదానికి కారణంగాతెలుస్తోంది. మృతురాలు ఉప్పలమ్మకు టుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

16 కిలోల ఎండు గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఏసీపీ, హనుమకొండ పోలీసులు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఒడిశానుంచి ముంబయికి గంజాయి తరలి స్తున్న యువకుడిని హనుమకొండ పోలీసులు అరెస్టు చేసి 16 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఏపీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం.. సూరత్‌కు చెందిన తలి తండ్రులు లేని గౌతం భరత్ సిందే అనే యువ కుడు రైళ్లలో సమోసాలు విక్రయి స్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో అర్జున్ అనే మరో వ్యక్తి ఒడిశా నుంచి గంజాయి తీసుకొస్తే డబ్బు లు ఇస్తానని ఆశ చూపగా.. గౌతం ఒడిశా నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తీసుకొస్తున్నాడు. పోలీసులు తనిఖీలు చేస్తున్నారనే సమాచారం మేరకు గురువారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో దిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు హనుమకొండ బస్టాండ్‌కు చేరుకు న్నాడు. బస్టాండ్ ఆవరణంలో ఉన్న పోలీసులను చూసి పారిపోయేందు కు ప్రయత్నిస్తుండగా ఎస్సై కిషోర్, సిబ్బంది యువకుడిని అదుపులోకి తీసుకొని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.



అవార్డును అందుకుంటున్న డాక్టర్ అనితారెడ్డి

అనితారెడ్డికి స్వచ్ఛ చాంపియన్ అవార్డు

బాలసముద్రం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కరుకాల అనితారెడ్డి స్వచ్ఛ చాంపియన్ అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. తన ఇంటితో పాటు నగరంలో అధికంగా మొక్కలు నాటడం, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయడం నీటి పొదుపు, ఇంకుడు గుంతలు తవ్వడంపై అవగాహన కార్యక్రమాలు ప్రజలకు నిర్వహిస్తున్నందుకు ఆమెను గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు అవార్డుకు ఎంపిక చేశారు.

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాబోయే మూడు రోజుల వర్షాలు, ఈదురుగాలులు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. గురువారం డైరెక్టర్లు, సీఈలు, జీఎంలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. 16 సర్కిళ్ల పరిధిలోని విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రతికూల వాతావరణంలో బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్ సంభవిస్తే త్వరతగిన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. ఖరీఫ్‌కాలానికి నాణ్యమైన విద్యుత్‌నందించేందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగే చోట అందుకు తగ్గట్లు కార్యాచరణ రూపొందించుకొవాలన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు, సీఈలు, జీఎంలు పాల్గొన్నారు.

భూపాల్‌రాజ్‌కు జీవిత కాల సాఫల్య అవార్డు



భూపాల్‌రాజ్

హసన్‌పర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ భూపాల్‌రాజ్‌కి భూసార పరిశోధనలో జీవిత కాల సాఫల్య అవార్డు లభించినట్లు ఎస్సార్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ దీపక్ గార్గ్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ హసన్‌లో గత నెల 26, 27వ తేదీలలో జరిగిన అంతర్జాతీయ సమావేశంలో భూసార పరిశోధనలో జరిపిన పరిశోధనలకు ఈ అవార్డును ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భూపాల్ రాజ్‌ను వీసీ దీపక్ గార్గ్, సిబ్బంది అభినందించారు.

ఎక్సైజ్ శాఖ వసూళ్ల పర్వం

- బెల్టు షాపుల నుంచి నెలవారీ మామూళ్లు
- వాహనాల వేలం పాటలో సైతం చేతివాటం
- వర్ధన్నపేటలో కార్యాలయంలో యథేచ్ఛగా అవినీతి

వర్ధన్నపేటరూరల్,ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట ఎక్సైజ్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. గుడుంబా, బార్లు, వైన్సుల నుంచే కాకుండా, ఇప్పుడు కొత్తగా బెల్టు షాపుల నుంచి సైతం నెలవారీగా మామూళ్ల వసూలు చేసే సరికొత్త ఎక్సైజ్ పాలసీని తీసుకొచ్చారు. దీనికి తోడుగా వాహనాల వేలంలో కూడా చేతి వాటాన్ని ప్రదర్శిస్తూ ఇక్కడి అధికారులు వాటాలు వేసుకుంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఉన్నతాధికారులకు సైతం వాటాలు ఇవ్వాలని, సహకరించి వ్యాపారం చేసుకోండని అభయం ఇవ్వడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

వెయ్యి కొట్టు.. బెల్టు పెట్టు..

వర్ధన్నపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పర్వతగిరి, రాయపర్తి, సంగెం, వర్ధన్నపేట మండలాలున్నాయి. ఈ మండలాల్లో బెల్టు షాపులు ఎక్కువగానే కొనసాగుతున్నాయి. ఒక్క వర్ధన్నపేట మండలంలోనే 18 గ్రామాల్లోనే దాదాపు 120 వరకు బెల్టు షాపులు ఉన్నాయి. ఇక వర్ధన్నపేట మునిసిపాలిటీలో 20-30 వరకు ఉంటాయి. అయితే వీటన్నింటి నుంచి రూ.2వేల చొప్పున మామూలు ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో గ్రామాల వారీగా బెల్టు షాపుల నిర్వాహకులు స్టేషన్‌కు వచ్చి అధికారితో చర్చలు జరిపారు. ఎక్కువగా బెల్టు షాపులు ఉన్న గ్రామాలకు రూ.వెయ్యి, తక్కువగా ఉన్న వాటికి రూ.2వేలుగా నిర్ణయించారని సమాచారం. అలాగే మార్చి నెల మామూళ్లు సైతం వసూలు చేసి ఇచ్చేసినట్లు తెలుస్తోంది.

బార్ టూ బెల్ట్

కొంత కాలంగా వర్ధన్నపేట మండల వ్యాప్తంగా బెల్టు షాపుల్లో బార్ షాపుల మద్యమే కనిపిస్తోంది. వైన్స్ షాపుల నుంచి వెళ్లాల్సిన మద్యం బార్ నుంచి వెళ్లడంతో వైన్స్‌షాపుల వ్యాపారం పూర్తిగా పడిపోయింది. నిబంధనలకు విరుద్ధంగా బార్ నుంచి ఓఆటోలో ఉదయాన్నే బెల్టు షాపులకు మద్యం వెళ్తోందని ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి వేళల్లో ఆర్డర్లు తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. బార్ షాపుల నుంచి పెద్ద మొత్తంలో మామూళ్ల ముట్టడంతోనే ఈ తతంగమంతా నడుస్తోందని చెపుతున్నారు. ఇటీవల ల్యాబర్తి తదితర గ్రామాల్లో వరంగల్ నుంచి ఎక్సైజ్ సంబంధిత అధికారులు దాడులు చేసి బార్‌షాపు మద్యాన్ని సీజ్ చేసినట్లు సమాచారం. కానీ బయటకు రాకుండానే లోపాయికారి ఒప్పందం చేసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులే చెప్పుకుంటున్నారు.

వాహనాల వేలంలోనూ వసూళ్లే...

ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలంలో సైతం వసూళ్ల పర్వం నడుస్తోంది. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేస్తారు. వేలంలో ఏమైనా మంచి వాహనాలు ఉంటే వాటిని అధికారులే కాజేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టుబడిన వాహనాల నుంచి కొంత సామగ్రిని సైతం బయటకు అమ్ముకోవడంతో పాటు వాహనాలను తప్పుదారి పట్టిస్తున్నారని సమాచారం. వాహనాల వేలంలో స్క్రాప్ కింద పోయే పలు వాహనాలను ఒకే వ్యక్తికి అమ్మేస్తారు. వేలంలో స్క్రాప్‌ను దక్కించుకున్న వ్యక్తి వాటిని కట్ చేయకుండా ఉండేందుకు అధికారులు రూ.వేలల్లో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఉన్నతాధికారులకు వాటాలు

వర్ధన్నపేట ఎక్సైజ్ పరిధలో మొత్తం 18 మద్యం షాపులు, రెండు బార్లు ఉన్నాయి. వీటి నుంచి నెలవారీగా రూ.35 వేల వరకు ఒక్కో షాపు నుంచి వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇది ఉండగానే బెల్టు షాపుల నుంచి సైతం నెలవారీగా మామూళ్ల వసూళ్లు చేసే పాలసీని గతంలో లేని విధంగా తీసుకొచ్చారు. ఇదేంటని ప్రశ్నించిన నిర్వాహకులతో ఖర్చులు భారీగా పెరిగిపోయాయని, ఉన్నతాధికారులకు సైతం వాటాలు ఇవ్వాలంటే డబ్బులు సరిపోవడంలేదని అధికారులే నేరుగా చెప్పడం గమనార్హం. కేసులు కాకుండా ఉంటాలంటే నెలకు ఎంతో కొంత ఇచ్చుకోకపోతే తప్పదని చెబుతున్నట్లు తెలుస్తోంది. కాగా, వర్ధన్నపేట ఎక్సైజ్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేసి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామల ప్రజలు కోరుతున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7300	5300
మక్కలు (బిల్టీ రకం)	2110	1521
కందులు	6716	3022
పెసళ్లు	7506	3022
పల్లికాయ (సూక)	6800	5200
పల్లికాయ (పచ్చిది)	4700	4575
పసుపు (కాడి)	11259	10534
పసుపు (గోల)	11559	9700
తేజ మిర్చి	13150	9500
వండర్‌హాట్	14000	10000
యూఎస్341	11500	9000
దీపిక	13000	10000
దేశీ	28500	18000
సింగిల్ పట్టి	-	-
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

వ్యక్తిత్వ వికాస వేదిక.. సాక్

విద్యార్థుల సృజనకు సాన


వరంగల్ నిట్‌లోని సాక్ సెంటర్



హనుమకొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైందిగా వరంగల్ నిట్‌కు పేరుంది. అందుకు తగ్గట్టుగానే ఇందులో చదువుతున్న విద్యార్థులు కూడా బహుముఖ ప్రజ్ఞావంతులుగా పేరుతెచ్చుకుంటున్నారు. చదువుతో పాటు సంగీత, సాహిత్య, సాంస్కృతిక, క్రీడా తదితర రంగాల్లో రాణిస్తున్నారు. వరంగల్ నిట్ వేదికగా జరిగే పోటీల్లోనే కాకుండా దేశంలోని ఇతర నిట్‌లలో నిర్వహించే అంతర్ నిట్ పోటీల్లోనూ సత్తా చాటుతున్నారు. పేరున్న కంపెనీల్లో మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు పొందుతున్నట్టే.. వివిధ పోటీల్లో విజేతలుగా నిలుస్తున్నారు. ఇందుకు కారణం వరంగల్ నిట్ క్యాంపస్‌లోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్). విద్యార్థులను చదువుతో పాటు వారికి ఇష్టమైన ఇతర కళారంగాల్లో రాణించేందుకు ఈ సాక్ వేదికగా నిలుస్తోంది. వారి వ్యక్తిత్వం బహుముఖంగా వికసించడంతో పాటు సృజనాత్మకతను వెలికి తీసి, దానికి సానబట్టి, నిష్ణాతులుగా తీర్చిదిద్దడంతో సాక్ చేయూతనిస్తోంది. వరంగల్ నిట్‌లో ప్రతీ సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే టెక్నోజియాన్, స్ప్రింగ్ స్ప్రీ, స్పికమెకే, యూత్‌ఫెస్ట్, ఫిల్మ్‌ఫెస్టివల్, ఇంటర్ టోర్నీల్లో విద్యార్థులు సత్తాచాటుతుండడం వెనుక స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్, ఇందులో అంతర్భాగమైన టెక్నికల్, అథ్లెటిక్, కల్చరల్, ఫిల్మ్ అండ్ మ్యూజిక్ సొసైటీలే కారణం.

టెక్నికల్ సొసైటీ..

ఈ సొసైటీ శాస్త్ర సాంకేతిక రంగాల్లో చోటు చేసుకుంటున్న సరికొత్త పరిణామాలు, ఆవిష్కరణలను విద్యార్థులకు ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు సెమినార్లు, సింపోజియాలు, వర్క్‌షాపులను నిర్వహిస్తోంది. తద్వారా విద్యార్థుల్లో సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది. సరికొత్త సాంకేతిక పరికరాలు, భౌతిక నమూనా రూపకల్పన, అభివృద్ధిలో విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందిస్తోంది. అంతేకాకుండా సృజనాత్మక సాఫ్ట్‌వేర్, గ్రాఫిక్ ఆధారిత నమూనాలు, గేమింగులు, ఇతర సవాళ్లు, అనువర్తనాలతో సహా కంప్యూటర్ ఆధారిత కార్యకలాపాలను ప్రోత్సహిస్తూ.. వీటిల్లో పోటీలను నిర్వహిస్తోంది. ప్రధానంగా నిట్‌లోని వివిధ విభాగాల సహకారంతో ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో ఏటా సాంకేతిక పండుగ టెక్నోజియాన్‌ను భారీ ఎత్తున నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో లబ్ధప్రతిష్ఠులైనవారితో వైజ్ఞానిక ప్రసంగాలను ఏర్పాటు చేస్తున్నది. జాతీయ స్థాయిలో జరిగే పోటీలు, సెమినార్లలో వరంగల్ నిట్ విద్యార్థులు భాగస్వాములు అయ్యేలా ప్రోత్సహిస్తోంది.

అథ్లెటిక్స్ సొసైటీ

ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులందరిని వారికి నచ్చిన ఆటలు, క్రీడాకార్యకలాపాల్లో పాల్గొనేట్టు అథ్లెటిక్ సొసైటీ ప్రోత్సహిస్తోంది. నిత్యం విద్యార్థులకు ఆటల్లో శిక్షణనిస్తోంది. ఏటా క్రీడా దినోత్సవాన్ని నిర్వహించి విజేతలకు బహుమతులను అందిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడలు, అథ్లెటిక్స్ పోటీల్లో వరంగల్ నిట్ విద్యార్థులు భాగస్వాములయ్యేలా చూస్తోంది. క్రీడల, సంబంధిత అంశాలపై సెమినార్లు, వర్క్‌షాపులు, శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది.

ఫిల్మ్ అండ్ మ్యూజిక్...

ఏటా సంగీతం, ఫొటోగ్రఫీ, డ్యాన్స్ ఫెస్టివల్స్‌ను నిర్వహించడం ద్వారా ఈ కళల్లో విద్యార్థుల ప్రతిభకు ఈ సొసైటీ సానబడుతోంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళా బృందాలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ద్వారా బహుళ సంస్కృతుల సమ్మేళనంలో నిట్ విద్యార్థులను భాగస్వాములను చేస్తోంది. ముఖ్యంగా ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో స్పికమేకే కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా వారిలో సంగీత జిజ్ఞాసను పెంపొందిస్తోంది. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరుగడించిన సంగీత విద్వాంసులను ఆహ్వానించి వారితో ప్రదర్శనలు ఏర్పాటు చేయిస్తోంది. విద్యార్థులకు సంగీతం, ఫొటోగ్రఫీ, నృత్యాల్లో శిక్షణా తరగతులను నిర్వహిస్తోంది. సంగీత, నృత్య ఫొటోగ్రఫీ తదితర రంగాల్లో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఏటా యూత్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పేరుగాంచిన సినిమాలను తెప్పించి విద్యార్థులు, సిబ్బందికి కాలేజీ ఆడిటోరియంలో ప్రదర్శింప చేస్తోంది. ఇందులో భాగంగా ప్రతీ ఏటా చలనచిత్రోత్సావాన్ని నిర్వహిస్తోంది.

స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్ ఏర్పాటు వెనుక ఒక మహత్తర లక్ష్యం, దూరదృష్టి ఉన్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలకు చెందిన విద్యార్థుల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ సెంటర్ ఏర్పాటైంది. నిట్‌లో నిత్యం చదువులో మునిగితేలే విద్యార్థులకు ఆటవిడుపుగా వారు పాఠ్యేతర కార్యకలాపాల్లోనూ పాల్గొనేలా ప్రోత్సహిస్తారు. అలాగే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పొంపొందించడం, వ్యవస్థాపకత, వినూత్న నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ఎంతో సహాయపడుతోంది. కాలేజీలో ఏటా

సాక్ ఏర్పాటు లక్ష్యం...

సాంకేతిక, సాంస్కృతిక, అథ్లెటిక్స్, చలన చిత్ర, సంగీత కార్యక్రమాల్లో ఇంటర్ నిట్ పోటీలను, ఇతర అంతర్, సంస్థాగత కార్యకలాపాలను నిర్వహిస్తోంది. సాక్ ఆధ్వర్యంలో నాలుగు సొసైటీలు విజయవంతంగా పని చేస్తున్నాయి. వేటికవే తమ నిర్దేశిత లక్ష్యాలు, ఉద్దేశాలతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఈ సొసైటీల కు ప్రతినిధులు విద్యార్థులే. సారథ్యంలోనే ఏ కార్యక్రమమైనా నడుస్తుంది. ఈ క్రమంలో నిట్ అధికారులు వారికి మార్గదర్శనం చేస్తారు.


స్ప్రింగ్ స్ప్రీ సందర్భంగా సినీ నేపథ్య గాయని గీతామాధురి మ్యూజికల్ నైట్ (ఫైల్)

కల్చరల్ సొసైటీ

సృజనాత్మక రచన, కవి త్వం, నాటకం, కళ, క్రాఫ్ట్, శిల్పం, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, క్విజ్ తదితర విభాగాల్లో పాఠ్యేతర కార్యకలాపాల్లో భాగంగా విద్యార్థులు పాల్గొనేలా కల్చరల్ సొసైటీ కృషి చేస్తోంది. సృజనాత్మక రచనపై వర్క్‌షాపులు, జాతీయ లేదా ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, కళాశాల దినోత్సవం లాంటి వేడుకలు కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక పోటీలను కూడా సొసైటీ నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రతీ ఏటా అంగరంగ వైభవంగా స్ప్రింగ్ స్ప్రీ (వసంతోత్సవం) వేడుకలు ఈ సొసైటీ నేతృత్వంలోనే జరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే సాంస్కృతిక బృందాలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ద్వారా బహుళ సాంస్కృతిక వాతావరణాన్ని సృష్టించడంలో కల్చరల్ సొసైటీ కీలక భూమిక పోషిస్తోంది.

- కళా రంగాల్లో రాణింపునకు శిక్షణ
- సంగీత, సాహిత్య, నృత్య క్రీడల్లో ప్రోత్సాహం
- వరంగల్ నిట్‌లో స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్


ఇటీవల నిట్‌లో జరిగిన స్ప్రింగ్ స్ప్రీ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వీధి నాటకం (నుక్కడ్)


నీలి నీలి.. ఆకాశం..



అప్పటివరకు సూర్యుడు సుర్రుమన్నాడు. ఎండతీవ్రతకు జనం అల్లాడిపోయారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు పడగా.. హనుమకొండలో వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమైంది. నీలిరంగు మేఘాలతో.. చల్లని గాలులతో ప్రజలకు ఆహ్లాదాన్ని, ఉపశమనాన్ని పంచింది. ఆ సమయంలో హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఓ వైపు పచ్చని చెట్లు.. వాటి మధ్య ఠీవిగా నిలిచిన కాకతీయ తోరణం.. పైన నీలి మేఘాలు ఆవరించిన ఆకాశం చూపరులను ఎంతగానో అలరించాయి.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

కాళేశ్వరంలో గోదావరి ఒడ్డున జ్ఞానతీర్థం


కాళేశ్వరంలో గోదావరి ఒడ్డున ఏర్పాటు చేయబోయే జ్ఞాన తీర్థం విగ్రహ నమూనా

- ప్రయాగరాజ్ తరహాలో ఏర్పాటుకు సన్నాహాలు
- అబ్బురపరిచేలా సుమారు రూ.20లక్షలతో నిర్మాణం
- సరస్వతి పుష్కరాలకు ముందే పూర్తయ్యేలా కసరత్తు


ప్రయాగ్‌రాజ్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాలు..

మహదేవపూర్ , ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రయాగరాజ్ తరహాలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం గోదావరి ఒడ్డున జ్ఞానతీర్థం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టగా.. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఏర్పాట్లలో భాగంగా మహా కుంభమేళాలో ఏర్పాటు చేసిన విధంగా కాళేశ్వరం గోదావరి పుష్కర ఘాట్ వద్ద భక్తులను ఆకట్టుకునేలా.. అబ్బురపరిచేలా జ్ఞాన తీర్థం విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రయాగరాజ్‌లో రెండు చేతులతో నమస్కరించే నమూనా విగ్రహాలను ఏర్పాటు చేయగా పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలోని సరస్వతీ పుష్కరాలలో ప్రయాగరాజ్ విగ్రహాలకన్నా అద్భుతంగా జ్ఞానాన్ని పంచేలా జ్ఞాన సరస్వతి చేతులలో తాళపత్రాలు చేతులలో ఉంచి జ్ఞాన తీర్థం ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గాను రూ.20 లక్షలు వెచ్చించనున్నారు. విగ్రహ ఏర్పాటుకు దేవాదాయ శాఖ స్థపతి, ఆర్కిటెక్చర్ అధికారులు మూడు రోజుల పాటు పుష్కర ఘాట్ వద్ద కొలతలు తీసుకొని అందుకు తగిన నమూనా చిత్రాన్ని తయారు చేశారు. పుష్కరాల కన్నా ముందే ఈ విగ్రహాలను పూర్తిచేసేలా కసరత్తు చేస్తున్నారు.

కష్టాలు గట్టెక్కే.. నీటిడ్రమ్ముతో నడిచొచ్చే..

నేటికీ పల్లెల్లో నీటి కష్టాలు కనిపిస్తూనే ఉన్నాయి. చాలామంది గ్రామీణులు ముఖ్యంగా అడవిబిడ్డలు నీటికోసం మైళ్ల దూరం నడిచేవారు. బిందెలను నెత్తినపెట్టుకుని ఆపసోపాలు పడుతూ ఇల్లు చేరే వారు. ఆ పరిస్థితుల నుంచి ఉపశమనం కలిగించేలా ములుగు జిల్లాలోని పలు గిరిపల్లెల ఆడబిడ్డలకు నాబార్డ్ అనే స్వచ్ఛంద సంస్థ 2018లో నెట్టుకుంటూ వెళ్లే నీటిడ్రమ్ములను అందజేసింది. వాటిని నేటికీ వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం పరిధిలోని తక్కళ్లగూడెం గ్రామంలో ఓ మహిళ చేతిపంపు ద్వారా ఆ డ్రమ్ములో నీటిని పట్టుకుని ఇదిగో ఇలా ఇంటికి తీసుకుపోతూ కనిపించింది.

ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి



చేతిపంపు వద్ద డ్రమ్ములో నీటిని పట్టుకుని, ప్లాస్టిక్ డ్రమ్మును బండిగిర్రలా సునాయాసంగా ఇంటి తీసుకెళుతున్న మహిళ

ఈశ్వర్.. ఈల వేస్తే!

- అరుదైన కళలో రాణిస్తున్న ఓరగల్లు బిడ్డ
- మల్టీట్యాలెంటెడ్‌గా గుర్తింపు తెచ్చుకున్న యువ కళాకారుడు

వడ్డెపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఈల పాటలకు పెట్టింది పేరు ఈశ్వర్. ఈలతో అలవోకగా పాటలు పాడుతూ అందరిని ఆకట్టుకుంటున్నాడు. కాజీపేట పట్టణ ప్రాంతంలోని ఫాతిమా నగర్ ప్రాంతానికి చెందిన కీర్తి సుమతి- తిరుపతి దంపతుల కుమారుడు వెంకటరత్నేశ్వర్. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రంగస్థల కళల విభాగంలో పీజీ పూర్తి చేశాడు. నటనపై మక్కువ, పాటలు పాడే సరదా బాల్యం నుంచే ఉండేది. ఎలాగైనా గాయకుడు కావాలనే పట్టుదలతో నాలుగు సంవత్సరాల పాటు వరంగల్ సంగీత నృత్య కళాశాలలో హిందుస్థాని గాత్రాన్ని అభ్యసించారు. అదే సమయంలో టీవీకి సంబంధించిన పలు పోటీల్లో పాల్గొంటూ తన ప్రతిభ పాఠశాలను ప్రదర్శిస్తున్నా పోటీల్లో నెగ్గక వెనకబడి పోయేవారు. తగిన విధంగా గుర్తింపు రాకపోవడంతో తనకు వచ్చిన కొత్త ఆలోచనకు రత్నేశ్వర్ శ్రీకారం చుట్టారు. ఈల పాటను సాధన చేస్తూ సమయం దొరికినప్పుడల్లా పలు వేదికల్లో ప్రదర్శనలు ఇస్తూ ప్రతిభను కనబర్చే వారు. ఈ క్రమంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో పదేళ్ల క్రితం నిర్వహించిన పాటల పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది. ఈ పోటీలలో గాయనీ గాయకులు గాత్రం ద్వారా పాటలను ఆలపిస్తే రత్నేశ్వర్ ఈల పాట ద్వారా పాటలను ఆలాపించి పలువురి చేత ఔరా అనిపించుకొని అభినందనలు అందుకొని ప్రత్యేక బహుమతిని కైవసం చేసుకున్నారు. ఇక వరంగల్‌లోని రెడ్ ఎఫ్ఎంలో తొలిసారి ఈలతోపాటలు పాడే అవకాశం రత్నేశ్వర్‌కు లభించింది. తన ఈల పాట ప్రస్థానం ద్వారా పలువురు శ్రోతలను మంత్ర ముగ్ధులను చేశారు. ఆ తర్వాత వరంగల్‌లోని ఆల్ ఇండియా రేడియోలో వచ్చే యువ వాణి కార్యక్రమం, ఈ ఎఫ్ఎం వరంగల్, ఈ ఎఫ్ఎం తిరుపతిలాంటి వాటితో పాటు పలు టీవీచానళ్లలో ప్రసారమయ్యే కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం వచ్చింది. అలా రత్నేశ్వర్ ఈల పాటతో పాటు వివిధ ఈవెంట్స్ చేస్తూ తన ప్రతిభను చాటుకుంటూ మల్టీ ట్యాలెంటెడ్‌గా నిలుస్తున్నాడు.



బుల్లితెరపై ప్రసారమయ్యే ఓ కామెడీ షోలో ఈశ్వర్



ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ఈల పాట ప్రదర్శిస్తున్న ఈశ్వర్ (ఫైల్)

ఏబీఎన్, ఆంధ్రజ్యోతిలో ప్రత్యేకం..

ఏబీఎన్, ఆంధ్రజ్యోతిలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా 2021 డిసెంబరు 31వ తేదీ రాత్రి నిర్వహించిన టీవీ షోలో రత్నేశ్వర్‌కు ఈల పాట పాడే అవకాశం లభించింది. ఏబీఎన్, ఆంధ్రజ్యోతిలో వచ్చిన చౌరస్తా అనే కామెడీ షోలో నటించి ప్రేక్షకులు , శ్రోతలను మెప్పించి, మైమరిపించారు. ఈల పాట ద్వారా ఈల పాట ఈశ్వర్‌గా పేరును మార్చుకున్న అతడు పలు వేదికలపై ప్రేక్షక సమాజాన్ని మెప్పిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు.

పర్యాటక ప్రదేశాలకు బస్సులెలా?

నగరంలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలంటున్న ప్రజలు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చారిత్రక నగరంగా, కాకతీయులు పరిపాలించిన రాజ్యంగా, జైనులు కొలిచిన దేవతల పుణ్య ప్రదేశంగా ప్రసిద్ధికెక్కిన ఓరుగల్లు పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి గాంచింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఖ్యాతికెక్కిన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వీటిని తిలకించడానికి ప్రతీరోజు ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, దేశ నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం పర్యాటకులు వస్తుంటారు. వీరు ముఖ్యంగా భద్రకాళి అమ్మవారిని, రుద్రేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఈ ఆలయాల సందర్శనకు వెళ్లాలంటే రవాణా సౌకర్యం కష్టంగానే ఉంది. ప్రత్యేక వాహనం ద్వారాగానీ ఆటోల ద్వారా గాని వెళ్లాల్సివస్తోంది. దీనివల్ల పర్యాటకులు ఇబ్బందిపడుతున్నారు. అందువల్ల ఈ ఆలయాలకు ప్రభుత్వం ప్రత్యేక బస్సులను నడిపించాలని పర్యాటకులు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్ల నుంచి ఉచిత బస్సులు

కాజీపేట, వరంగల్ ప్రాంతాలకు రైలు మార్గం ద్వారా దేశం నలుమూలల నుంచి అనేక మంది పర్యాటకులు వస్తుంటారు. వీరు వరంగల్‌లో భద్రకాళి అమ్మవారిని, హనుమకొండలో వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శిస్తారు. వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి భద్రకాళి దేవాలయానికి దాదాపు 3 కిలో మీటర్ల దూరం ఉంటుంది. వేయి స్తంభాల దేవాలయం 5 కిలో మీటర్లు ఉంటుంది. కాజీపేట నుంచి వేయి స్తంభాల దేవాలయం 10కిలో మీటర్లు, భద్రకాళి దేవాలయం 12 కిలో మీటర్ల దూరం ఉంటుంది. హనుమకొండ బస్టాండ్ నుంచి వేయి స్తంభాల దేవాలయం 1 కిలో మీటరు, భద్రకాళి దేవాలయం 3 కిలో మీటర్ల దూరం ఉంటుంది. భక్తుల కోసం రైల్వేస్టేషన్లు, బస్టాండ్ల నుంచి ఈ ఆలయాలకు దేవస్థానం నుంచి గాని లేక స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గాని రెండు బస్సులు ఉచితంగా నడపాలని కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు..

వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాంతాలైన ఆత్మకూరు పంచలింగ శివాలయం, కాళేశ్వరం, రామప్ప దేవాలయం, లక్నవరం చెరువు, మేడారం సమ్మక్క- సారలమ్మ గద్దెలు, మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంతో పాటు ఇతర పర్యాటక ప్రాంతాలు తిలకించడానికి హనుమకొండ, వరంగల్ బస్టాండ్ల నుంచి ప్రతీ రోజు బస్సులు నడపాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా ఖిలా వరంగల్, జూపార్కు, గోవిందరాజుల గుట్ట, మ్యూజికల్ గార్డెన్, భద్రకాళి దేవాలయం, వేయిస్తంభాల గుడి, కలెక్టర్ ఆఫీస్, కాకతీయ యూనివర్సిటీ, మెట్టు రామలింగేశ్వర ఆలయం, నిట్ ప్రాంగణం, భద్రకాళి బండ్ ప్రాంతాలకు కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాల భక్తులు కోరుతున్నారు.

సామాన్యులను ఇబ్బంది పెట్టొద్దు

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ షాపుల నిర్వాహకులు అధిక ధరలతో సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేదిలేదని కలెక్టర్ సత్యశారద అన్నారు. వరంగల్ తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ సత్యశారద ఆకస్మికంగా సందర్శించారు. తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్‌తో మాట్లాడి కార్యాలయం పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయానికి ఆనుకొని ఉన్న జిరాక్సు సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధిక ధరలతో దరఖాస్తు ఫారంలు అమ్మడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సా మాన్యులకు ఇబ్బందులు కలిగే విధంగా వ్యవహరి స్తూ కార్యాలయానికి ఆనుకొని ఉన్న జిరాక్సు సెంటర్ల ను వెంటనే తొలగించాలని ఆదేశించారు. తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ పాల్గొన్నారు.



తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

ఎస్సీ కార్పొరేషన్‌కు యువవికాసం

● 3,442 యూనిట్లు మంజూరు చేసిన సర్కారు ● 70 నుంచి 100 శాతం వరకు సబ్సిడీ ● ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు గడువు

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 2024-25 వార్షిక ప్రణాళికలో భాగంగా రాజీవ్ యువ వికాసం పథకం కింద వరంగల్ జిల్లా ఎస్సీ కార్పొరేషన్‌కు 3442 యూనిట్లు మంజూరయ్యాయి. స్వయం ఉపాధి పథకం కింద మొత్తం 2547 యూనిట్లు, వ్యవసాయం తదితర వాటి కింద మరో 895 యూనిట్లు మంజూరయ్యాయి. స్వయం ఉపాధి కింద రూ.1 లక్ష విలువ యూనిట్లు 952 కేటాయించారు. ఈ యూనిట్ కింద లబ్ధిదారులకు 90 శాతం సబ్సిడీ లభిస్తుంది. బ్యాంకు రుణంగా పది శాతం అందుతుంది. రూ. 2 లక్షల విలువైన యూనిట్లు 738 మంజూరు అయ్యాయి. దీని కింద 80 శాతం సబ్సిడీ, 20 శాతం బ్యాంకు లోన్ లభిస్తుంది. రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు విలువైన యూనిట్లు 469 మంజూరు అయ్యాయి. వీటి కింద 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు రుణం లభిస్తుంది. రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు విలువైన యూనిట్లు 388 కేటాయించగా వీటికిగాను లబ్ధిదారులకు 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు రుణం అందుతుంది. కాగా వ్యవసాయం, పశుసంవర్ధకం, హార్టీకల్చర్, సెరికల్చర్ యూనిట్లు 228 మంజూరు కాగా వీటి కింద రూ. 2 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు విలువైన యూనిట్లకు 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు రుణం.. అలాగే పిటి స్కీం కింద 570 యూనిట్లు మంజూరు కాగా లబ్ధిదారులకు 100 శాతం సబ్సిడీ లభిస్తుంది. చిన్ననీటి పారుదల, ఎనర్జయిజేషన్ యూనిట్లు 54 మంజూరు కాగా, యూనిట్ విలువ రూ. 1.20 లక్షలు. దీని కింద కూడా 100 శాతం సబ్సిడీ ఇస్తారు.



రూ.1.20 లక్షల విలువైన కరెంట్ మోటార్ యూనిట్లు 40, రూ. 3. లక్షల విలువై సోలార్ పంపు సెట్లు, బోర్‌వెల్స్ 3 యూనిట్లకు కూడా నూరు శాతం సబ్సిడీ ఇస్తారు. యూనిట్ల కోసం లబ్ధిదారులు ఎస్సీ కార్పొరేషన్‌లో www.tsobmms.cgg.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

అర్హతలు..

రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తు చేసుకునేందుకు లబ్ధిదారులు ఎస్సీ కులానికి చెందినవారై ఉండాలి. రేషన్ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలి. దరఖాస్తుదారుడి వయసు 21-55 (జూలై 1 వరకు) సంవత్సరాల మధ్య ఉండాలి. వ్యవసాయ, వ్యవసాయ ఆధారిత పథకానికి మాత్రం వయసు 21-60 సంవత్సరాల మధ్య ఉండాలి. వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాలవారికి రూ.1.50 లక్షల లోపు.. పట్టణ ప్రాంతాలవారికి (మున్సిపాలిటీ, కార్పొరేషన్, నగర పంచాయతీలు) రూ.2లక్షలలోపు ఉండాలి. దరఖాస్తుదారుడు ఏ ప్రభుత్వ సంస్థ నుంచి కూడా ఇది వరకు లబ్ధి పొంది ఉండరాదు. మీసేవ ద్వారా జారీ అయిన కులం, ఆదాయం (ఈ సంవత్సరం) ధ్రువీకరణ పత్రాలు తప్పని సరిగా కలిగి ఉండాలి. ఆన్‌లైన్ (ఏబీఎంఎంఎస్) ద్వారా నమోదు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే అర్హులు. వాహనాల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలి. దరఖాస్తుదారుల సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్, మునిసిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు సైతం ఏర్పాటు చేయనున్నారు.

అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి. దరఖాస్తు గడువు ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించినందున అర్హులైన, ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చు. రేషన్ కార్డులోని కుటుంబ సభ్యుల్లో ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకో వాల్సి ఉంటుంది.

రామాలయంలో రెండో రోజు పూజలు



రామాలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఖిలావరంగల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో పుష్కరకాల కుంభాభిషేక మహోత్సవ పూజా కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం 34వ డివిజన్ రామాలయంలో గణపతి సచ్చిదానందస్వామి వారి ఆశీస్సులతో దత్త విజయానంద తీర్థ స్వామి శిష్య బృందం వారిచే రెండో రోజు ప్రత్యేక పూజలు జరిగాయి. గురువందనం, గణపతి ప్రార్థన, ఆవాహిత దేవతా పూజ, కుంకుమార్చన, నవగ్రహ యోగిని దేవతా హోమం, చండీహోమం తదితర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12-30 గంటలకు పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాద వితరణ, సాయంత్రం 4-30 గంటలకు ఆవాహిత దేవతాపూజ, క్షేత్రపాలక దేవతా హోమం, శ్రీరామతారక మూలమంత్ర హోమం, సాయంత్రం 6-30 గంటలకు శ్రీ సీతారామ కల్యాణం సాయం కాలం అర్చన, నీరాజన మంత్ర పుష్పాలు, అష్టావ దాన సేవ, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ట్రస్టు అధ్యక్షుడు వొడ్నాల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మంచాల కృష్ణమూర్తి, కోశాధికారి చింతం యాదగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీరామ్ రాజేష్, కార్యవర్గ సభ్యులు బుదారపు భాస్కర్, బత్తుల నవీన్‌కుమార్, ఆడెపు సాంబమూర్తి, కుడికాల సుధాకర్, కొండి రాజమౌళి, కొత్తగట్టు నరసింహమూర్తి, డాక్టర్ పొన్నం దశర థం, మీసా సత్యనారాయణ, శామంతుల భిక్షపతి, రావికంటి అశోక్, నాయిని అనిల్, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దత్త విజయానందతీర్థ స్వామి రాక

నగరంలోని రామాలయంలో శ్రీమహాగణపతి, సుబ్రహ్మణ్య, లలితాదేవీ, శివ, పంచముఖ ఆంజనేయ సహిత శ్రీ సీతారామచంద్రస్వామి వారి పుష్కరకాల కుంభాభిషేక మహోత్సవానికి శుక్రవారం దత్త విజయానందస్వామి రానున్నారని దేవాలయ కమిటీ తెలిపింది.



రామాలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలి

కరీమాబాద్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు.40వ డివిజన్‌లోని డీకే నగర్‌లో గురువారం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కుండే రాజు అధ్యక్షతన దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ రవి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమురయ్యనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కుండే రాజు, కార్యదర్శి పోలెపాక మల్లేశం, కోశాధికారి కుండె కుమార్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ కార్యదర్శి వనం కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్ రాంమూర్తి మృతి



రాంమూర్తి (ఫైల్)

ఖిలావరంగల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):సీనియర్ ఫొటోగ్రాఫర్ బేతి రాంమూర్తి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఖిలావరంగల్ 38వ డివిజన్ చెమన్ ప్రాంతానికి చెందిన రాంమూర్తి భార్య ఇటీవల మృతి చెందడంతో ఆ బాధను తట్టుకోలేక మదనపడుతూ గురువారం మృతి చెందాడని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన అవసరం



యాంటీ డ్రగ్స్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాస్

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులందరూ అవగాహన కలిగి ఉండాలని రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్ అన్నారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, యాంటీ డ్రగ్స్ కమిటీ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల పట్ల కలుగుతున్న అనర్థాలపట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం యాంటీ డ్రగ్స్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భగీరథ్, యాంటీ డ్రగ్స్ కమిటీ సభ్యులు డాక్టర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ చారి, డాక్టర్ రమేష్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శైలజ, సుస్మిత, కృష్ణవేణి, డాక్టర్ పి. రాజన్న పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి

మిల్స్‌కాలనీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై లాఠీ చేయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థులకు క్షమాపణ చెప్పి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ డిమాండ్ చేశారు. చలో హెచ్‌సీయూ కార్యక్రమంలో బీజేవైఎం నాయకుల పట్ల పోలీసుల ప్రవర్తనను నిరసిస్తూ గురువారం వరంగల్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. వర్సిటీ భూములను, పర్యావరణాన్ని కాపాడుకోవాలని ప్రయత్నిస్తూ శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు చేసిన లాఠీచార్జీకి బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలన్నారు. వర్సిటీకి చెందిన బయోడైవర్సిటీ పార్కును తనకు అనుకూలంగా ఉన్న కార్పొరేట్ శక్తులకు అమ్ముకోవడం సరికాదని హితవు పలికారు. సెంట్రల్ వర్సిటీ భూములను అమ్ముకోవాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలను బీజేపీ చూస్తూ ఊరుకోదని ఖచ్చితంగా అడ్డుకుంటుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌వీర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జిల్లా ప్రధానకార్యదర్శి బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, బీజేవైఎం శ్రవణ్, రఘునారెడ్డి, రంజిత్, ప్రణయ్, మున్నా, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

అసమర్థ కాంగ్రెస్‌పై ఇక సమరమే..

మిల్స్‌కాలనీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అసమర్థ కాంగ్రెస్‌పై ఇక నుంచి బీజేపీ సమరానికి శంఖం పూరించిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కె.మాధవి స్పష్టం చేశారు. గురువారం ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన జిల్లా స్థాయి పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాధవి మాట్లాడారు. బీజేపీ ఆధ్వర్యం లో స్థానిక సమస్యలపై ప్రజా ఉద్యమాలు నిర్మించి కాంగ్రెస్ 420 హామీలైన ఆరుగ్యారంటీల వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రజాసమస్యల పరిష్కారానికి ముందుకు సాగాలని పదాధికారులకు సూచించారు. అనంతరం రవి మాట్లాడుతూ.. ఏప్రిల్ 6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవం, 11న జ్యోతిరావు పూలే జయంతి 14న అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారి విగ్రహాల వద్ద స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, రత్నం సతీష్‌షా, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాంచందర్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శులు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, నాయకులు రాణాప్రతాప్‌రెడ్డి, సముద్రాల పరమేశ్వర్, మార్టిన్ లూథర్, బైరి నాగరాజు, భరత్‌వీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కె.మాధవి

హెచ్‌సీయూ భూములను పరిరక్షించండి

పార్లమెంట్‌లో ప్రస్తావించిన ఎంపీ రవిచంద్ర

మట్టెవాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూములను అన్యాక్రాంతం కాకుండా వాటిని పరిరక్షించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. విలువైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరించాలని కోరారు. గచ్చిబౌలి వద్ద నెలకొన్న ఈ కేంద్రియ విశ్వవి ద్యాలయానికి ఉన్న భూముల్లో 400 ఎకరాలను వేలం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిలువరించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అత్యంత విలువైన ఈ భూములను పరిరక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు. గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో యూనివర్సిటీల అంశాన్ని లేవనెత్తారు. విద్యా పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తు అవస రాల కోసం యూనివర్సిటీ భూములను రక్షించాలని కోరారు. హెచ్‌సీయూ భూముల్లో నీటి వనరులతో పాటు అరుదైన వృక్ష సంపద, పక్షి జాతులు, జంతువులు, జింకలు, నెమళ్లు, తాబేళ్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయని, వాటి మనుగడకు ప్రమాదం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.



రాజ్యసభలో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఈవీఎం గోదాములను

పరిశీలించిన జిల్లా కలెక్టర్



ఈవీఎం గోదాములను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి గురువారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెలకోసారి నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లా ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి, ఈవీఎంలలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాములకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ వంటి వాటిపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 22 మందికి జరిమానా

మట్టెవాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 22 మంది వాహనదారులకు గురువారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బో జు వెంకటేశం జరిమానా, ఇద్దరు వాహనదారులకు జైలు శిక్ష విధించినట్లు వరం గల్ ట్రాఫిక్ సీఐ రామక్రిష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి పోలీసులకు పట్టుబడ్డ 22 మంది వాహనదారులకు రూ.26,500 జరిమానా విధించారు. మద్యం తాగిన వాహనం నడిపిన కేసులో వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన మంతుర్తి కుమారస్వామికి రూ.2వేలు జరిమాన మూడు రోజుల జైలు శిక్ష విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన కేసులో కరీంనగర్ జిల్లా సైదాపూర్‌కు చెందిన పొడిశెట్టి లక్ష్మణ్‌కు రూ.500 జరిమానా మూడు రోజుల జైలు శిక్ష విధించి నట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు. వీరిద్దరిని పరకాల సబ్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు పాలు కావల్సి ఉంటుందని తెలిపారు.

పేదల బండి.. వరంగల్ నుంచి నడపాలండి..

● కాజీపేట నుంచే వెళుతుండడంతో ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు

గిర్మాజిపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉదయం పూట హైదరాబాద్‌కు వెళ్లే పుష్‌పుల్ రైలును గతంలో మాదిరిగా వరంగల్ నుంచి నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు. నిత్యం హైదరాబాద్‌కు వెళ్లే పేద, దిగువ మధ్యతరగతి ప్రజలు ఈ రైలుపైనే ఆధారపడతారు. పైగా హైదరాబాద్‌కు వివిధ పనులమీద వెళ్లేవారికి, ఉద్యోగస్థులకు ఈ రైలు సమయం అనుకూలంగా ఉంటుంది. మిగతా వాటితో పోల్చితే చార్జీ కూడా తక్కువే కావడంతో ఎక్కువ మంది దీనిమీదే ఆధారపడతారు. తొలుత పుష్‌పుల్ రైలు కాజీపేట నుంచి హైదరాబాద్‌కు నడిచేది. అయితే వరంగల్ ప్రజల డిమాండ్ మేరకు వరంగల్ నుంచి నడిపించారు. వరంగల్ నుంచి ఉదయం 5.20 గంటలకు, మధ్యాహ్నం 2.15 గంటలకు హైదరాబాద్‌కు నడిపించారు. అయితే కరోనా లాక్‌డౌన్ కాలంలో అన్ని రైళ్లతో పాటుగా పుష్‌పుల్ రైలును నిలిపివేశారు. తర్వాత ప్రయాణికుల ఒత్తడితో గత ఏడాది జూలై 25న రూ.35 చార్జితో కాజీపేట నుంచి పునరుద్ధరించారు. కాని, కాజీపేట నుంచే నడిపిస్తున్నారు. ఒక్క మధ్యాహ్నం 2.15 గంటల ట్రిప్ మాత్రమే వరంగల్ నుంచి నడుస్తోంది. దీంతో ఉదయం హైదరాబాద్‌కు పుష్‌పుల్‌లో వెళ్లాలంటే వరంగల్ వాసులు కాజీపేట ఆటోలలో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరంగల్ నగరంతో పాటు సమీప గ్రామాల ప్రజలు ఉదయం పూట హైదరాబాద్‌కు తక్కువ చార్జీలతో వెళ్లాలంటే కాజీపేటవరకు ఆటోలో వెళ్లి అక్కడి నుంచి పుష్‌పుల్ రైలులో వెళ్తున్నారు. వరంగల్ నుంచి ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో వెళ్లే అవకాశం ఉన్నా అవి ఉదయం నాలుగు నుంచి ఐదు గంటలలోపే వెళ్లిపోతాయి. వాటి చార్జీలు రూ.75 నుంచి రూ.85వరకు ఉన్నాయి. పైగా అందులో సీట్లు దొరకడం అనేది కల్ల. అందువల్ల వరంగల్ నుంచి ఆస్పత్రులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వ్యాపార,వాణిజ్య అవసరాలకు వెళ్లే వారితో పాటు ఇంటర్వ్యూలకు వెళ్లే నిరుద్యోగులు, వివిధ కోర్సులు చదివే పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఈ రైలే అనుకూలంగా ఉండడంతో వారంతా కాజీపేటకు ఆటోలలో వెళ్తున్నారు. గతంలో మాదిరిగా ఉదయం 5.20 గంటలకు వరంగల్ నుంచి పుష్‌పుల్ రైలు సికిందరాబాద్‌కు నడిపితే అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందని నగర ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

బోగీల సంఖ్య పెంచాలి..

గతంలో ఉదయం వేళ హైదరాబాద్‌కు పుష్‌పుల్ నడిపినపుడు వరంగల్ లోనే రైలు పూర్తిగా నిండేది. దీంతో కాజీపేటలో ఎక్కేవారు సీటు దొరకక ఇబ్బంది పడేది. ఆ సమస్య మళ్లీ రాకూడదంటే పుష్‌పుల్ రైలుకు బోగీల సంఖ్య పెంచాలని ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు కోరుతున్నారు.



బోగీల సంఖ్య పెంచాలని ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు కోరుతున్నారు.

ఎంపీ కావ్య చొరవచూపాలి..

పుష్‌పుల్ రైలును వరంగల్ నుంచి నడపడంతో పాటు బోగీల సంఖ్య పెంచే విషయంతో ఎంపీ కడియం కావ్య చొరవ చూపాలని నగర ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు దక్షిణమధ్య రైల్వే అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

విధుల్లో చేరిన బల్దియా టీపీబీవోలు

13 మంది ఉద్యోగులు బల్దియాకు నియామకం

సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు జారీ

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ బల్దియాకు 13 మంది టీపీబీవో(టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్స్)లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. కాగా, గురువారం బల్దియా కార్యాలయంలోని సీ-1 సెక్షన్ సూపరింటెండెంట్ రావుల ఆనంద్‌ను కలిసి వారి నియామక పత్రాలను అందించారు. ప్రస్తుతం 10 మంది ఉద్యోగులు రిపోర్టు చేశారని, ఇంకా ముగ్గురు రావాల్సి ఉందని ఆనంద్ వెల్లడించారు. కాగా, వీరు టౌన్‌ప్లానింగ్ విభాగంలో పని చేస్తున్న సీనియర్ బిల్డింట్ ఇన్‌స్పెక్టర్లకు కొద్ది రోజుల పాటు సహాయకులుగా పని చేస్తారు. 13 మందికి గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్‌లలో తలా కొన్ని డివిజన్‌లను కేటాయిస్తారు. వీరు 2023లో నిర్వహించిన టీఎస్‌పీఎస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. మెరిట్ ప్రకారం 13 మంది టీపీబీవోలను నియమించారు. 2024లో ఉద్యోగ నియామక జాబితా వెల్లడించగా, గత నెల మార్చి 24న హైదరాబాద్ రవీంద్ర భారతీలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందించినట్టు జూనియర్ ఉద్యోగులు వెల్లడించారు.



బల్దియాలో విధుల్లో చేరుతున్న టీపీబీవోలు



సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డితో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

సీఎం రేవంత్‌రెడ్డిది నిర్బంధ పాలన

- విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేశారు
- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి నిర్బంధ, నిరంకుశ పాలన సాగిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా దాస్యం వినయ్ భాస్కర్ ధ్వజమెత్తారు. గురువారం హనుమకొండలోని సుబేదారి పోలీసుస్టేషన్‌లో అరెస్టు అయిన కేయూ విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. అక్కడే ఉన్న సీఐతో మాట్లాడి రెండు రోజులుగా విద్యార్థులను విడుదల చేయకుండా పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేదాక విద్యార్థులకు అండగా బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు బైరపాక ప్రశాంత్, గొల్లపల్లి వీరస్వామి, పస్తం అనిల్, రాసూరి రాజేష్, బి.నర్సింహరావు, బాషబోయిన సంతోష్, మొగిలి వెంకటరెడ్డి, హకీం నవీన్, మాలోతు రాజేష్, మర్రి మహేష్, మంద నరేష్, ఎల్తూరి సాయికుమార్, కుమ్మరి శ్రీనాథ్, శివ, రంజిత్, వంశీ, వినయ్ తదితరులు పోలీసుల అదుపులో ఉన్నారు.



ఎస్సారెస్పీ భూములపై కన్ను

కాకతీయుల కోటకట్ట భూములకు రక్షణ కరువు

- కాలువకు ఇరుపక్కలా మాయమవుతున్న మట్టి
- చదును చేసి కబ్జాకు కొందరి యత్నం
- ఇప్పటికే కొన్నిచోట్ల ప్రైవేటు వ్యక్తులకు పట్టాలు
- ఎస్సారెస్పీ భూముల్లో వెలిసిన గుడిసెలు
- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

గీసుగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల నాటి మట్టికోట, ఎస్సారెస్పీ భూములపై కొంతమంది కబ్జాకోరులు కన్నేశారు. ఇప్పటికే గుట్టుచప్పుడు కాకుండా కోటకట్ట, ఎస్సారెస్పీ భూములను కొందరు పట్టాలు చేసుకున్నట్లు సమాచారం. ప్రధానంగా వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని బాలయ్యపల్లి నుంచి శాయంపేట వరకు ఎస్సారెస్పీ ప్రధాన కాలువకు ఇరుపక్కలా వందల ఎకరాల భూమి చదునై ఉంది. కాలువ పక్కన వ్యవసాయ భూములు ఉన్న వారు ఎస్సారెస్పీ భూములు ఆక్రమించుకొని సాగుచేస్తున్నారు. అంతేకాకుండా డీబీఎం 38, డీబీఎం 40 కాలువలకు ఇరువైపులా, అండర్ టన్నెల్ (యూటీ) ఉన్న చోట కూడా ఎస్సారెస్పీ భూములు కబ్జాలకు గురయ్యాయని స్థానికులు అంటున్నారు. దీనిపై కొద్ది రోజుల కిందట ఎస్సారెస్పీ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు కూడా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మామూళ్లకు ఆశపడి ఎస్సారెస్పీ అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కు అవుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. బాలయ్యపల్లి సమీపంలో యూటీ కాలువను సగం వరకు ఆక్రమించటంతో వర్షాకాలంలో యూటీ కాలువలో నీరుపట్టక పంట పొలాలను ముంచెత్తుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే కొనాయిమాకుల వద్ద ఉండే ప్రధాన కాలువ ఇరుపక్కలా ఉన్న భూములకు బాగా డిమాండ్ ఉండడంతో కొంతమంది ఆ భూములను కాజేసి అక్రమ పట్టాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే వంచనగిరి నుంచి పోతరాజుపల్లి వరకు కోట మట్టిని తరలించుకుపోయారు. తేలిన భూమిని ఇప్పటికే పట్టాలు చేయించుకొని సాగుచేస్తున్నారు. కొన్నేళ్ల కిందట ఓ ప్రైవేటు వ్యక్తి ఎస్సారెస్పీ భూమిని ఏకంగా ప్లాట్‌లు చేసి అమ్మేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిలిచిపోయింది.

కొనాయిమాకుల వద్ద..

ఎస్సారెస్పీ ప్రధాన కాలువ తవ్వే క్రమంలో కొనాయిమాకుల ప్రాంతం ఎత్తుగా ఉండటంతో నీటి ప్రవాహం అనుకూలంగా ఉండేందుకు కాలువను ఎక్కువ లోతుగా తవ్వినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో తవ్విన మట్టిని బయటకు ప్పలుగా పోసేందుకు గాను ప్రధాన కాలువకు ఇరువైపులా 100 నుంచి 150 మీటర్ల మేర భూమిని కొనుగోలు చేశారు. అయితే ఇటీవల ఆ మొరాన్ని అ క్రమంగా తరలించటంతో ఇపుడు భూమి చదునుగా మారింది. గీసుగొండ కెనాల్ గేట్ల నుంచి డీబీఎం 40 వరకు గల దాదాపు 100 ఎకరాల ఎస్సారెస్పీ భూములకు కోట్లల్లో ధర పలుకుతుండడంతో భూ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల వందలాది మంది ఎస్సారెస్పీ భూముల్లో గుడిసెలు వేసుకున్నారు. కాగా, ఎస్సారెస్పీ కొంత భూమిలో సోలార్ పవర్ ప్లాంట్, డెయిరీ ఫామ్ నిర్మాణాలు చేపట్టి వాటి నిర్వహణ బాధ్యతను మహిళా సంఘాలకు అప్పచెప్పేందుకు ఇటీవల రెవెన్యూ అధికారులు సర్వేచేశారు.

పట్టించుకోని అధికారులు

ఎస్సారెస్పీ భూములతో పాటు కాకతీయుల కోటకట్ట భూములు కబ్జాలు, అన్యాక్రాంతం అవుతున్నా అటు పురావస్తు శాఖ అధికారులు గానీ, ఇటు ఎస్సారెస్పీ అధికారులు గానీ పట్టించుకోవటం లేదనే విమర్శలున్నాయి. ఆక్రమణకు గురైన భూములను పట్టాలు చేసుకుంటున్నట్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎస్సారెస్పీ భూములకు ఎందుకు హద్దులు నిర్ణయించడంలేదని వారు ప్రశ్నిస్తున్నారు.

హద్దులు నిర్ణయించకపోవడంతో కొన్నిచోట్ల కెనాల్ సమీపంగా ఉన్న భూ యజమానులకు భూ పట్టాలు కావడంలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎస్సారెస్పీ భూములకు హద్దులు నిర్ణయించి ఆక్రమణలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు కోరుతున్నారు.

మట్టి మాయం

ఒకప్పుడు ఎస్సారెస్పీ కాలువకు ఇరు పక్కలా ఎత్తైన కొండల లాంటి మట్టికుప్పలు కనబడేది. కానీ, అవి ఇప్పుడు కానరాకుండా పోయాయి. మట్టి దందా వ్యాపారులతో కొండల లాంటి మట్టి అక్రమంగా తరలించబడి ఆనవాళ్లు లేకుండా పోయాయి. అక్రమ మట్టి వ్యాపారంతో కొందరు లక్షలు గడించారు. కెనాల్ మొరం తరలించుకుపోవటంతో వందల ఎకరాలను కబ్జా చేసేందుకు చాపకింద నీరులా ప్రయత్నిస్తున్నారు.

సహకార సంఘాలు ఆర్థిక వృద్ధిని సాధించాలి

- వ్యాపార మార్గాలను విస్తరించుకోవాలి
- శిక్షణ తరగతుల్లో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు ఆర్థికంగా వృద్ధి సాధించాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సూచించారు. సహకార శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడారు. సంఘాలు ఆర్థికంగా వృద్ధి సాధించేందుకు అవసరమైన మార్గాలను అన్వేషించాలన్నారు. కొత్త ఆలోచనలతో కూడిన వాటితో పాటు ప్రస్తుత వ్యాపారాలను విస్తరించుకోవాలన్నారు. ప్రణాళిక మేరకు కృషి చేస్తే తప్పక ఆర్థిక ప్రగతి సాధన ఉంటుందన్నారు. సహకార సంఘాలు రైతు ఉత్పత్తిదారుల సంస్థలాగా పనిచేస్తే మంచి లాభాలను ఆశించవచ్చని సూచించారు. సాధారణ సేవా కేంద్రాల ద్వారా సేవలు అందిస్తూ రైతుల అభిమానాన్ని చూరగొనాలని పేర్కొన్నారు. రైతులకు దీర్ఘకాలిక రుణాలు అందచేయాల్సి ఉందన్నారు. డీసీసీ బ్యాంక్ టర్నోవర్ రూ.870కోట్ల నుంచి రూ.2,229 కోట్లకు చేరడం గర్వంగా ఉందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 19 శాఖలుగా డీసీసీ బ్యాంకును 32 శాఖలకు విస్తరించినట్లు తెలిపారు. నందనంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ మార్కెట్ వ్యాపార వృద్ధిని సాధిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్ ఎం.డి. కేవీఎస్ అన్నపూర్ణ, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, ఉమ్మడి జిల్లాలోని డీసీవోలు సంజీవరెడ్డి, నీరజ, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వాల్యానాయక్, వెంకటేశ్వర్లు, సర్దార్‌సింగ్‌తోపాటు డీసీసీబీ సీఈవో వజీర్ సుల్తాన్, డైరెక్టర్లు జగన్‌మోహన్‌రావు, హరిప్రసాద్, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రస్ట్రేషన్‌లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు

- హెచ్‌సీయూ పక్కనున్న భూములపై అనవసర రాజకీయం
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే కుట్ర
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ధర్మసాగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నాయని, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు అందించే బియ్యం ధర రూ.40 అయితే కేంద్రం.. రూ.30 చెల్లిస్తోందని, రాష్ట్రప్రభుత్వం కేవలం రూ.10 మాత్రమే భరిస్తోందని సంజయ్ కనీస అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. బీజేపీకి నిజంగా పేదలపై ప్రేమ ఉంటే దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. కల్వకుంట కుటుంబం తెలంగాణపై పడి దోచుకోవడం వల్ల వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి పదేళ్ల నీటి పారుదల శాఖ నిధులను మళ్లించారని ఆరోపించారు. కేసీఆర్ తన సొంత జిల్లా మెదక్‌లో కొండ పోచమ్మ, రంగనాయక్ సాగర్, మల్లన్న సాగర్ మూడు రిజర్వాయర్లతో పాటు తన ఫామ్ చుట్టూ సీసీ లైనింగ్‌తో పాటు కాలువల నిర్మాణం చేపట్టారని విమర్శించారు. కాళేశ్వరానికి ఖర్చు చేసిన లక్ష కోట్లలో కనీసం ఐదు వేల కోట్లు దేవాదుల ప్రాజెక్టుకు ఖర్చు చేస్తే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు సాగు నీరు వచ్చేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్ట్ పనులను త్వరితగతిగా పూర్తి చేసేందుకు కృషి చేస్తోందన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయించి ప్రతీ ఎకరానికి సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రసాద్, మాజీ సర్పంచ్‌లు శరత్, కునూరు రాజు, మండల నాయకులు పాల్గొన్నారు.

వాహన మరమ్మతుల జాప్యంపై మేయర్ సీరియస్

బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డు ఆకస్మిక తనిఖీ



వెహికిల్ షెడ్డులో అధికారులకు సూచనలిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చెత్త తరలింపు వాహనాల మరమ్మతులో సిబ్బంది చేస్తున్న జాప్యంపై మేయర్ గుండు సుధారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డును మేయర్ సంబంధిత అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడి రిజిస్టర్ పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. రెండు మాసాలుగా శానిటేషన్ విభాగం చెత్త తరలింపు స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లు మరమ్మతులు చేయకుండా షెడ్డుకే పరిమితమైనట్టు తన దృష్టికి వచ్చిందని అన్నారు. ఇప్పటికైనా వాహనాలు మరమ్మతు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ మహేందర్, డీఈ శివానందం, ఏఈలు పణికుమార్, సంతోష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

చపాట మిర్చికి జియో ట్యాగింగ్ శుభపరిణామం

- అంతర్జాతీయ ఎగుమతులకు అవకాశం
- వరంగల్ కలెక్టర్ సత్యశారద
- అధికారులతో కలిసి ఏనుమాముల మార్కెట్ సందర్శన



చపాట మిర్చిని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 3: (ఆంధ్రజ్యోతి): మన దగ్గర సాగయ్యే చపాట మిర్చి జియో ట్యాగింగ్ గుర్తింపు లభించడం శుభపరిణామమని, మిర్చిని అంతర్జాతీయ ఎగుమతులు చేసుకునేందుకు మంచి అవకాశం లభిస్తోందని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను గురువారం కలెక్టర్ సత్యశారద సందర్శించారు. మిర్చి యార్డును సందర్శించి చపాట మిర్చి రైతులతో మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు? చపాటమిర్చి ఎంత సాగు చేశారు? ఎంత దిగుబడి వచ్చింది? మార్కెట్లో ఎంత రేటు పలికింది? లాంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు సాగు, దిగుబడి వివరాలు చెప్పారు. మార్కెట్లో మిర్చికి ధరలు చాలా తక్కువగా ఉన్నాయని, మూడేళ్ల కిందట చపాట మిర్చి క్వింటా రూ.లక్ష వరకు పలుకగా ప్రస్తుతం ఇరవై నుంచి ముప్పై వేల మధ్యలోనే ధరలు ఉంటున్నాయని కలెక్టర్‌కు తమ ఆవేదనను చెప్పుకున్నారు. ముప్పై ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా మూడేళ్ల కిందట చపాట మిర్చికి మంచి డిమాండ్ పలుకడంతో రూ.లక్ష వరకు పలికిన వాస్తవమేనని కానీ.. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో చపాట మిర్చి ఎగుమతులు తగ్గడంతో ధరలు పడిపోయాయని వ్యాపారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యాపారులు, రైతు సంఘాల కోరిక మేరకు మార్కెట్లో రైతులకు మజ్జిగ పంపిణీ చేపడతామన్నారు. సరుకులను తూకం వేసే పీవోఎస్ మిషన్లు మరిన్ని కావాలని రైతులు అడుగుతున్నారని, వాటిని కూడా తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

ఈ సందర్భంగా టాయిలెట్స్ అందుబాటులో లేవని, దూరంగా ఉండడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. అలాగే కార్యనిర్వహణ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఒక భవనం కావాలని కలెక్టర్‌ను వ్యాపారులు అభ్యర్థించారు. దీంతో రైతులకు టాయిలెట్స్ అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని మార్కెట్ కార్యదర్శిని ఆదేశించారు. వ్యాపారులకు తాత్కాలికంగా చైనా టెంట్ వేసి కార్యకలాపాలు నిర్వహించుకునే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కాగా, అంతకుముందు ఈవీఎంలను భద్రపరిచిన గోదాములను కలెక్టర్ సందర్శించారు. ఆ తదుపరి మార్కెట్‌లో త్వరలో ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాట్లను పరిశీలించారు. రైతు విశ్రాంతి భవన్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఎంవో సురేఖ, మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్యా, తహసీల్దార్ ఎక్బాల్, గ్రేడ్-2 కార్యదర్శి అంజిత్‌రావు, ఏఎస్ రాజేందర్, రాజేష్ డి.కరాణీ, చింతపల్లి వీరారావు, సాగర్ల శ్రీనివాస్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి

వర్ధన్నపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : దండకారణ్యంలో ఆపరేషన్ కగార్ పేరిట కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేస్తున్న హత్యకాండను వెంటనే నిలిపివేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు. దండకారణ్యంలో ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఏప్రిల్ 8న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలోని ఆదివాసి గిరిజనులను చంపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సెల్ ఫోన్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

నెక్కొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సెల్ ఫోన్లు విలువైన వస్తువులే కాకుండా వ్యక్తులకు సంబంధించిన సమాచారం ఉంటుందని, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని నెక్కొండ ఎస్సై మహేందర్ తెలిపారు. నెక్కొండ పోలీసు స్టేషన్ పరిధిలో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి గురువారం ఎస్సై అందించారు. సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వ్యక్తులు ఇచ్చిన దరఖాస్తుల ఆధారంగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి వాటిని బాధితులకు అప్పగించారు. రూ. 2లక్షల 50వేల విలువ కలిగిన 14 సెల్ ఫోన్లను ట్రేస్ చేశామని ఎస్సై వివరించారు. ఫోన్లు ట్రేస్ చేసిన వీపీసీ మంజుల, వీసీ నరేష్‌ను ఎస్సై మహేందర్ అభినందించారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

• ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

గీసుగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా పాలన లక్ష్యమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. 15వ డివిజన్ మొగిలిచర్ల, 16వ డివిజన్ జాన్‌పాకలో సన్న బియ్యం పంపిణీని మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారదతో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నిరుపేదలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో రేషన్‌షాపులలో సన్న బియ్యం ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. అందరు కూడా సన్న బియ్యాన్ని తినాలని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజా సంక్షేమం కోసం ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు జరిగాయన్నారు. గరీబ్ హఠావో ద్వారా పేదలకు ఇండ్లతో పాటు ఉపాధిహామీ, ఆహారభద్రత వంటి పథకాలను తీసుకువచ్చిందన్నారు. సమాజికంగా, ఆర్థికంగా అన్ని వర్గాల ప్రజలు ఎదగడానికి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. అర్హులైన అన్ని కుటుంబాలకు ప్రజా సంక్షేమ పథకాలు అందించే విధంగా పార్టీలకతీతంగా రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతుందన్నారు. అనంతరం ఏకవీర ఎల్లమ్మ దేవాలయ పునరుద్ధరణ పనులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, స్థానిక నాయకులు కొండేటి కొమురారెడ్డి, దూపాకి సంతోష్, ఎలగొండ ప్రవీణ్, సారయ్య పాల్గొన్నారు

● చెన్నారావుపేట(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతముగ్దుంపురం, కోనాపురం గ్రామాల్లో ప్రభుత్వం అందించే సన్న బియ్యం పథకాన్ని మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాలాయి శ్రీనివాస్, తహసీల్దార్ ఫణికుమార్ గురువారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గిర్దావర్ రషీద్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిదెన రమేష్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌గౌడ్, నారాయణరెడ్డి, తిరుమలేష్, మల్లయ్య, భిక్షపతి, మోనోహర్ పాల్గొన్నారు.

● వర్ధన్నపేట రూరల్ (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత సన్న బియ్యం పథకాన్ని వినియోగించుకోవాలని వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్ సాగర్ అన్నారు. గురువారం మండలంలోని రామవరం, ఇల్లంద గ్రామాల్లో బియ్యం పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. చెన్నారంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బర్ల సహదేవ్ ఉచిత బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో ఆర్ఐ హసీఫ్, నాయకులు బర్ల బాబు, భిక్షపతి, నీలమ్మ, మమత, సతీష్, స్వామి, కుమారస్వామి, స్వామి, రాజాలు తదితరులు పాల్గొన్నారు.



జాన్‌పాకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

● పర్వతగిరి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దౌలత్‌నగర్, చింత నెక్కొండ, ఏనుగల్లు గ్రామాల్లో గురువారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో శంకర్ నాయక్, తాహసీల్దార్ వెంకటస్వామి హాజరై సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు.

● రాయపర్తి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాగన్నగూడెం, పెర్కవేడు, మహబూబ్‌నగర్ గ్రామాల్లో గురువారం ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాయపర్తి తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిషన్, ఆర్ఐ సంధ్యారాణి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యానాయక్. మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పాలకుర్తి ఆలయ డైరెక్టర్ మహేందర్ రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఉస్మాన్, కాశీనాథం, సమ్మయ్య పాల్గొన్నారు.

● నెక్కొండ (ఆంధ్రజ్యోతి): నిరుపేద ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యాన్ని వినియోగించుకోవాలని మండల ప్రత్యేకాధికారి అనురాధ, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ రావుల హరీష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ముదిగొండ, గుండ్రపల్లి, వెంకటాపురం, పనికర, సూరిపల్లి, బొల్లికొండ గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో సూరిపల్లి సొసైటి ఛైర్మన్ ఘంట దామోదర్‌రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు కుసుమ చెన్నకేశవులు, బండి శివకుమార్, నాగేంద్రమ్మ, సాయికృష్ణ, శ్రీధర్‌రెడ్డి, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

● ఖానాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఎక్కడలేని విధంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తుందని నర్సంపేట ఏఎంసీ వైస్ ఛైర్మన్ శాఖమూరి హరిబాబు అన్నారు. గురువారం అశోక్‌నగర్, దబీర్‌పేట, రంగాపురం గ్రామాల్లోని రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ స్వామి, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు గంగ్రాతి రవి తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గొండి (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సన్న బియ్యం పథకాన్ని వినియోగించుకోవాలని మార్కెట్ ఛైర్మన్ పాలాయి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మహ్మదాపురం, మర్రిపల్లి, తిమ్మంపేట, బొబ్బరోనిపల్లి, మల్లంపల్లి, నారాయణతండా గ్రామాల్లో గురువారం సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. మహ్మదాపురంలో మార్కెట్ ఛైర్మన్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రెల బాబు, బాలయ్య, రమేశ్, భాస్కర్, రమేష్, శివాజీ, గోవర్ధన్ పాల్గొన్నారు.

వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం

వడ్లూరి ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, నెక్కొండ

ఫటా ఫట్



ఆంధ్రజ్యోతి: 2025 సంవత్సరం వర్షాకాలంలో రాష్ట ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే వనమహోత్సవానికి ఎన్నివేల మొక్కలు సిద్ధంచేశారు?

ఎంపీడీవో : వనమహోత్సవంలో నాటేందుకు మూడు లక్షల తొంబై వేల మొక్కలను సిద్ధం చేశాం.

ఆంధ్రజ్యోతి: వనమహోత్సవం మొక్కలు ఎక్కడ పెంచుతున్నారు ?

ఎంపీడీవో: మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేశాం. ఈ నర్సరీలో దాదాపు పది వేల మొక్కలు పెంచుతున్నారు. ఎక్కువగా పండ్ల, పూల మొక్కలను పెంచుతున్నారు.

ఆంధ్రజ్యోతి: వనమహోత్సవానికి సంబంధించి గ్రామాల్లో ఇంటింటికి ఎన్ని మొక్కలను పింపిణీ చేస్తారు ?

ఎంపీడీవో: ఇంటింటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేస్తాం. అందుల్లో మూడు పండ్ల మొక్కలు, మూడు పూల మొక్కలు ఉంటాయి.

ఆంధ్రజ్యోతి: గత సంవత్సరం హరితహారంలో నాటిన మొక్కల్లో ఎన్ని వేల మొక్కలు బతికాయి (నాటుకున్నాయి)?

ఎంపీడీవో: మండలంలో 83శాతం వరకూ మొక్కలు నాటుకున్నాయి. ఉపాధిహామి సిబ్బంది పర్యవేక్షణలో మొక్కలను రక్షించాం. ప్రతీ మొక్క చుట్టూ హరితహారం స్కీంలో ప్లాస్టిక్ సంచులను ఏర్పాటు చేశారు. అలాగే వర్షాకాలం తరువాత నవంబరు నుంచి ఆరు నెలల వరకు మొక్కలు నీరు అందించారు. జీపీ సిబ్బంది కూడా మొక్కల రక్షణలో సహాయపడ్డారు. ఈ సంవత్సరం కూడా వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నాం.

నెక్కొండ (ఆంధ్రజ్యోతి)

అసమర్థ కాంగ్రెస్‌పై ఇక సమరమే..

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్

గీసుగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసమర్థత పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ సమర శంఖారావం పూరించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ అన్నారు. ధర్మారం వద్ద గల పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన పదాదికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రధాని మోదీ వికసిత్ భారత్ కోసం అకుంటిత దీక్షతో పనిచేస్తున్నారన్నారు. ప్రధాని నిస్వార్థ సేవకు ప్రజలు దేశవ్యాప్తంగా బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. అందుకే ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందన్నారు. తెలంగాణలో కూడా రానున్న స్థానిక ఎన్నికల్లో విజయపథంలో దూసుకెళ్లి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు దిమ్మతిరిగేలా చేస్తుందని ధీమావ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనతో విసిగి పోయిన చదువుకున్న యువత బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. పార్టీ ఆవిర్భావం సందర్భంగా ఈ నెల 6న నిర్వహించే గావ్ ఛలో... బస్తీ ఛలోలో యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి, నాయకులు కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, రాంచందర్ రెడ్డి, హరిశంకర్, తిరుపతిరెడ్డి, ప్రతాప రెడ్డి, పరమేశ్వర్, మార్టిన్ లూథర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్

హెచ్‌సీయూ భూముల అమ్మకం ఆలోచనను మానుకోవాలి

నర్సంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వ విరమించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఈసంపెల్లిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంపెల్లి బాబు మాట్లాడుతూ విద్యార్థులపై, ఎస్ఎఫ్ఐ నాయకులపై పోలీసుల నిర్బంధాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ భూముల రక్షణ కోసం పోరాటం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి నాయకులను, సీపీఎం నాయకులకు ఎక్కడికక్కడ అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా పోరాటాలపై, నాయకులపై నిర్బంధం పెరిగిందన్నారు. గత ప్రభుత్వం అవలంబించిన విధానాలనే రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తుందని ఆయన విమర్శించారు. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకొని అమ్మకానికి పెట్టడం సరైందికాదని, వెంటనే భూముల అమ్మవద్దని, యూనివర్సిటీ అభివృద్ధికి వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్, గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, సతీష్, బుర్రి ఆంజనేయులు, హన్మకొండ సంజీవ, కలకోట్ల అనిల్, వజ్జంతి విజయ, స్వప్న, నాగమణి, ఇంద్ర, యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేటలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

● చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మే ఆలోచనను విరమించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పరికి మధుకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులపైన పోలీసుల నిర్బంధాన్ని ఆపాలన్నారు. హెచ్‌సీయూ భూముల సంరక్షణ కోసం పోరాటం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యా ప్తంగా విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గపు చర్యని అన్నారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



నర్సంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న కురుమ కులస్తులు

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 98వ జయంతి వేడుకలను నర్సంపేట పట్టణంలోని కురుమ సంఘం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా డివిజన్‌లోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన కురుమ కులస్తులు పట్టణంలోని అమరవీరుల స్థూపం నుంచి డప్పుచప్పుళ్లతో అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వరంగల్‌లో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు ఖరారు చేయాలని కురుమ కులస్తులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు బుడగొండ భిక్షపతి, కంకల రాజు, అమ్మ కిరణ్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎర్రబెల్లి

పర్వతగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజోతి) : మండలంలోని వడ్లకొండ గ్రామంలో సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గురువారం పాల్గొన్నారు. వీరి వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు మనోజ్, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, రాజు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



వడ్లకొండ గ్రామస్థులతో ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాకాల రైతుమిత్ర సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఖానాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పాకాల రైతు మిత్ర పరస్పర సహాయ సహకార సంఘం 20వ వార్షిక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గులాంనబీ(డాక్టర్ బాబ), ఉపాధ్యక్షుడిగా ఎడ్ల భిక్షంరెడ్డి,కోశాధికారిగా దేవులపల్లి నర్సింహారావు, కార్యవర్గ సభ్యులుగా ఎడ్ల వాసుదేవరెడ్డి, వల్లెపు శ్రీనివాస్, మందలపు శ్రీనివాస్, చూడి మధుసూదన్‌రెడ్డి, సిరిపోతుల వీరస్వామి, దేవినేని శ్రీనులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తక్కళ్లపెల్లి రమేష్, మల్యాల పోశెట్టి, చూడి లింగారెడ్డి, వీరమల్ల రాములు, మస్తాన్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గులాంనబి

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

గీసుగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మనుగొండ గ్రామానికి చెందిన కొల్లూరి హైమావతి, ఎలుకుర్తి గ్రామానికి చెందిన నమ్మకాయల శివ, రాయపురి ఎల్లయ్య, వనపర్తి చంద్రమౌళి, బానోతు సారమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కాగా మృతుల కుటుంబాలకు సామాజిక వేత్త అల్లం బాలకిశోర్‌రెడ్డి ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున పంపించారు. మృతుల కుటుంబాలను నాయకులు అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్, రడం భరత్ గురువారం పరామర్శించి ఆర్థికసాయాన్ని అందించారు. రాజ్‌కుమార్, చాపర్తి కనుకయ్య, ప్రభాకర్, కమలాకర్, రాజేష్, సురేష్, సాంబయ్య, మొగిలి ఉన్నారు.

గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఆదుకోవాలి

నర్సంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వరంగల్‌రోడ్‌లోని అంబెద్కర్‌నగర్ కాలనీ గుడిసెవాసులకు పట్టాలు అందించి ఆదుకోవాలని దళిత, ప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్ గద్ద వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు, పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎంఎస్పీ, డీబీడీపీఎస్ ఆధ్వర్యంలో గుడిసెవాసులు చేపట్టిన దీక్షలు గురువారంతో 10వ రోజుకు చేరాయి. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ప్రణయదీప్, జలగం కుమార్, ప్రజాదండోరా జాతీయ అధ్యక్షుడు అండె రవి, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్‌కుమార్‌తో కలిసి దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సారమ్మ, సరోజన, స్వరూప, జయ, శారద, శ్రీకాంతచారి, సుధాకర్, రాములు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

చెన్నారావుపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఉప్పరపల్లిలో గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ అందించారు. గ్రామానికి చెందిన చింతకింది వెంకటేశ్వర్లు, కాసాని మల్లయ్య, కుక్కల సుస్మిత హాస్పిటల్‌లో చికిత్సలు పొందగా వారి కుటుంబాలకు రూ.1లక్ష 48 వేలను అందించారు. అక్కల్‌చెడ గ్రామానికి చెందిన బాదావత్ అమ్మకు రూ.14వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు వట్టే తిరుపతిరెడ్డి, కాసాని రమేష్, అండె వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పులి సారయ్య, వెంకన్న పాల్గొన్నారు.

● దుగ్గొండి (ఆంధ్రజ్యోతి) మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన బోగోజు నాగభూషణంకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశం మేరకు సీఎం సహాయ నిధి నుంచి రూ:24 వేలు మంజూరయ్యాయి. కాగా, గురువారం బాధితుడికి చెక్కును గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొట్టె రమేష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గిన్నె నర్సింహస్వామి, కొలిపాక భాస్కర్, వెంకటేశ్వర్లు, పెండ్యాల సాంబయ్య, ఎంగల రమేష్, కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాను సందర్శించిన ఎంఈవో

చెన్నారావుపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకులాన్ని మండల విద్యాశాఖాధికారి బైరి సరళ గురువారం సందర్శించారు. పాఠశాలను సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఆడిట్‌లో భాగంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు సాధించిన విజయ గాథలను విన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాలకు మంచిపేరు తీసుకరావాలన్నారు. పాఠశాలలోని స్టోర్ రూమ్, కిచెన్‌షెడ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌వో జ్యోతి పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా సఖీ కేంద్రాలు

దుగ్గొండి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సఖీ కేంద్రాలు పనిచేస్తున్నాయని సఖీ కేంద్రాలపై అవగాహన కలిగిఉండాలని సెంటర్ ప్రతినిధులు తిరుమల, స్వప్న అన్నారు. మండలంలోని తిమ్మంపేటలోని రెండో అంగన్‌వాడీ కేంద్రం, స్థానిక వీవో సెంటర్‌లో గురువారం సఖీ కేంద్రాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ సోమ స్వరూప, వీవో అధ్యక్షురాలు నరహరి సంధ్య, సీఏ రడం కవిత పాల్గొన్నారు.


పైప్ లీకేజీ.. వృథాగా పోతున్న నీరు



ఉప్పరపెల్లి గ్రామ పంచాయతీ సమీపంలో పైపు లీకేజీతో వృథాగా పోతున్న నీరు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపెల్లి గ్రామంలో పైప్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. గ్రామ పంచాయతీ సమీపంలోనే లీకేజీ ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోక పోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేసవి కాలం ఇప్పటికే ప్రారంభమైంది. భూగర్భ జలాలు అడుగంటి తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. కానీ తాగునీటి కోసం వేసిన పైప్ లైన్ల ద్వారా వచ్చే నీరు లీకేజీల కారణంగా రోడ్డు వృథాగా పోవడంతో అధికారుల నీటి జాగ్రత్త మాటలు ఇలాంటి వాటికి అర్ధం పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తు న్నారు. ఇప్పటికైనా లీకేజీని అరికట్టి నీటి వృథాను నిలిపివేయాలని కోరుతున్నారు.

పత్తిపాక సీతారామచంద్రస్వామి నూతన కమిటీ



పత్తిపాక సీతారామచంద్రస్వామి కమిటీ

నెక్కొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పత్తిపాక గ్రామ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీని ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా పసునూటి సంతోష్‌కుమార్, వైస్ ఛైర్మన్‌గా లావుడ్యా చిన్నతిరుమల్, ప్రధాన కార్యదర్శిగా బోడ లక్ష్మణ్, సహకార్యదర్శి బాదావత్ సునీల్, కోశాధికారిగా ఉసిల్లపాటి సురేష్, కార్యవర్గ సభ్యులుగా గట్ల వెంకటేశ్వర్లు, బొల్లెబోయిన పరుశరాములు, దొమ్మటి మనోహర్, వసునూటి యాకయ్య, ఈదునూరి రఘుపతి, మాదారపు వీరస్వామి, బాదావతు మోహన్, మాదారపు మల్లయ్య, ఈదునూరి రాములు, రేకుల రాజాలు, లావుడ్యా రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి లావుడ్యా తిరుమల్‌నాయక్ తెలిపారు.

రైతులు కోతలు వాయిదా వేసుకోవాలి

పర్వతగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలు కోయడాన్ని వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి ప్రశాంత్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రాబోవు రెండు రోజుల్లో మండలంలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు వరి, మొక్కజొన్న, కోత దశలో ఉన్న ఇతర పంటలు కోయడాన్ని వాయిదా వేసుకోవాలన్నారు. ఇప్పటికే కోసిన పంటలను వర్షాలకు తడవ కుండా రైతన్నలు జాగ్రత్త పడాలని సూచించారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

నెక్కొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తోపనపల్లి గ్రామంలోని కాయితోజు విజేందర్‌కు చెందిన పాడిగేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. పాడిగేదె వ్యవసాయ మేతకు వెళ్లి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో ప్రమాదవశాత్తు నేలకు దగ్గరగా ఉన్న విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. ఈ ప్రమాదంలో రూ.50 వేల ఆస్తినష్టం జరిగింది.

బిట్స్‌లో ప్రాంగణ నియామకాలు

నర్సంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్నెపల్లి సమీపంలో గల బిట్స్ కళాశాలలో గురువారం ఎక్సెలర్ కంపెనీ వారు ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థుల ఎంపిక కోసం ప్రాంగణ నియామకాలు చేపట్టిందని బిట్స్ ఛైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు రవిచంద్ర, అవినాశ్ మాట్లాడుతూ గురువారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల కార్యక్రమంలో 215మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, మొదట నిర్వహించిన పరీక్షలో 62 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. తర్వాత నిర్వహించిన డిష్కషన్ రౌండ్‌లో 33 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన వారికి సంవత్సరానికి 3-4 ఐపిఏ వేతనం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీఎస్.హరిహరన్, అకాడమిక్ కో-ఆర్డినేటర్ నారాయణ, ముఖ్య ప్రాంగణ నియామకాల అధికారి ఎస్.సురేశ్, ప్లేస్‌మెంట్ అధిపతి పసిఅమ్మద్‌సర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

గురిజాల హైస్కూల్‌లో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని నర్సంపేట మండలం గురిజాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హర్యాణా రాష్ట్రంలోని ప్రజల వేషధారణ, ఆహార పు అలవాట్ల ప్రదర్శన నిర్వహించి పలువురిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.అర్పిత, ఉపాధ్యాయులు రమేష్, చంద్రశేఖర్, సాధత్, చంద్రకళ, బి.రమేష్, రాజేష్, రాహుల్ పాల్గొన్నారు.

మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహించాలి

నర్సంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):ఈ నెలలో వరుసగా వచ్చే మహనీయుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని దళిత. ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్ గద్ద వెంకటేశ్వర్లు, కో-కన్వీనర్లు కల్లెపెల్లి ప్రణయదీప్, గుంటివీర ప్రకాశ్, అండె రవి మాట్లాడారు. ఈనెల 5న ఉదయం 10గంటలకు పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే బాబు జగ్జీవన్‌రామ్ జయంతి, 11న ఉదయం 10 గంటలకు సెంట్రల్ బ్యాంక్ ఎదుట మహాత్మా జ్యోతిరావు పూలే, 14న ఉదయం 10 గంటలకు అంబేద్కర్ సెంటర్‌లో జరుగనున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని దళిత, ప్రజా సంఘాల నాయకులకు వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్, రమేశ్, సుధాకర్, రాంజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత, ప్రజా సంఘాల జేఏసీ నాయకులు